# తెలుగుదేశం పార్టీ మినీ మేనిఫెస్టోతో రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీ

- గాలి భానుప్రకాష్

నగరి, జూలై 2 ప్రభాతవార్త:

నగరిలో జరిగిన భవిష్యత్‌కు గ్యారెంటీ చైతన్య రథయాత్ర కార్యక్రమం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం ప్రకటించిన తొలి విడత మేనిఫెస్టో భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నగరి టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగింది. ఆదివారం నగరి పట్టణంలో భవిష్యత్ గ్యారెంటీ చైతన్య రథయాత్రను ఆయన ప్రారంభించారు. ఓంశక్తి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం పాదయాత్రగా టవర్‌క్లాక్ సర్కిల్‌కు చేరుకుని ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి బస్సు చైతన్య రథయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా గాలి భానుప్రకాష్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజల వద్దకు వెళుతుంటే భవిష్యత్ అంధకారంగా ఉందని, ఒక్క ఛాన్స్ అంటూ వైసీపీ ప్రభుత్వాన్ని నమ్మి మోసపోయామని ప్రజలు చెబుతున్నట్లు తెలిపారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అన్ని వర్గాల సంక్షేమం కోసం మేనిఫెస్టో పెట్టారని, కచ్చితంగా టీడీపీ అధికారంలోకి వస్తుందని తెలిపారు. కేవలం 3 నెలల్లో 23 వేల



కోట్లు అప్పు తెచ్చారని, అప్పుకు లెక్కలు లేదని, రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసి ఆ భారాన్ని ప్రజల మీద మోపి పలు రకాలుగా లాగేస్తున్నారన్నారు. ఉద్యోగస్తులకు సక్రమంగా జీతాలు ఇచ్చుకోలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని, అమ్మ ఒడి, పథకంతో కొంత మందికి ఇచ్చి మమ అనిపించారని ఆరోపించారు. అనంతరం నగరి రూరల్ మండలం కృష్ణా రామాపురం గ్రామంలో రచ్చబండ, పల్లె నిద్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిత్తూరు, తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు పులివర్తి నాని, నరసింహయాదవ్, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ ఇన్‌చార్జిలు చల్లా బాబు(పుంగనూరు), హెలెన్(సత్యవేడు, వి.ఎం.థామస్(జీడీ నెల్లూరు), నరసింహ ప్రసాద్(రైల్వే కోడూరు), మాజీ మంత్రి పరసారత్నం, నియోజకవర్గ పరిశీలకులు చెన్నూరు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ వైసీపీ పరిపాలనలోరాష్ట్రం దేశంలోనే వెనుకబడిన రాష్ట్రంగా మారింది. జగన్ రాష్ట్రం మొత్తం సెంట్రలైజ్ చేసి దోపిడీకి పాల్పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్ బాగుపడాలంటే తెలుగుదేశం ప్రభుత్వం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన మహాశక్తి పథకంలో మహిళలకు ఎటువంటి నిబంధనలు, వివక్ష లేకుండా ప్రతినెల రూ.1500లు అందించడం జరుగుతుందని, తల్లికి వందనం పేరుతో ఎంత మంది పిల్లలు, చదువుకుంటూ ఉంటే అంత మంది పిల్లలకు 15 వేలు అందిస్తామన్నారు. సమావేశంలో నగరి నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎంజిఎం ఆస్పత్రిలో ఘనంగా డాక్టర్స్‌డే వేడుకలు

తొట్టంబేడు, జూలై 2 ప్రభాతవార్త

డాక్టర్స్‌డే సందర్భంగా పట్టణంలోని ఎంజిఎం ఆస్పత్రిలో డైరెక్టర్ గుద్దూరుమయూర్ ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్ డే వేడుకలను నిర్వహించారు. శ్రీకాళహస్తి-నాయుడుపేట, సూళ్ళూరుపేటకు సంబంధించిన సుమారు 100మంది డాక్టర్లు అందరు కుటుంబసమేతంగా పాల్గొని ఆనందంగా గడిపారు. కార్పొరేట్ తరహా వైద్యాన్ని కూడా తక్కువ ఖర్చుతో ఎంజిఎం ఆస్పత్రిలో అందిస్తున్న డైరెక్టర్ గుద్దూరుమయూర్‌ను వైద్యులు అభినందించారు. సుమారు ఐదేళ్ళుగా 24గంటలు అత్యవసర కేసులు, ఆరోగ్యశ్రీ మరియు ఎన్నో బీమా పథకాల ద్వారా ఉచిత వైద్యసేవలు చేస్తూ శ్రీకాళహస్తి మరియు చుట్టుపక్క ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చిన ఎంజిఎం ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్లు ధన్యవాదాలు తెలిపారు.

## ఉత్సవాలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం

తొట్టంబేడు, జూలై 2 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణంలోజరుగుతున్న శ్రీద్రౌపదీదేవి సమేత ధర్మరాజులస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా చివరిరోజైన అగ్నిగుండ మహోత్సవంలో భాగంగా శ్రీకాళహస్తి,తొట్టంబేడు మండల లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఏడాదినిర్వహించే అన్నదాన కార్యక్రమానికి ఈఏడాది కూడా చేపట్టారు. ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు విచ్చేసి ప్రారంభించారు. సుమారు రెండువేల మంది భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు పాలమంగళం రవి, లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు సుబ్రమణ్యం, చిరంజీవిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు మరియు లారీ ఓనర్స్ అసోసియేషన్ యజమానులు పాల్గొన్నారు.

## కుప్పంలో విచారణకు వెళ్లిన పోలీసులపై దౌర్జన్యం..

- ఇరువర్గాల గొడవల్లో వ్యక్తి మెడపై కత్తితో దాడి.. కేసులు నమోదు

కుప్పం, జూలై 2 ప్రభాతవార్త

కుప్పం అర్బన్ కాలనీలో ఇరువర్గాల మధ్యగొడవలు జరిగి ఒకరి మెడపై కత్తితో నరికాడన్న సమాచారం అందడంతో అక్కడకు చేరుకున్న పోలీసులపై దౌర్జన్యం చేసిన వారిపై కేసులు నమోదు చేసినట్లు అర్బన్ సిఐ శ్రీధర్ తెలిపారు. సిఐ తెలిపిన మేరకు వివరాలిలా.. కుప్పంకు చెందిన కృష్ణమూర్తి కుమారుడు, మణి అనే వ్యక్తి కుమార్తెను గతంలో వివాహం చేసుకుంటానని చెప్పి మోసం చేశాడన్నారు. ఈవిషయంగా ఆదివారం కుప్పం అర్బన్ కాలనీకి చెందిన వేలు ఇంట్లో పంచాయతీ నిర్వహిస్తున్నారన్నారు. ఈసమయంలో ఘర్షణలు జరిగి మణి అనే వ్యక్తి కృష్ణమూర్తి మెడపై కత్తితో నరికాడన్న విషయం తమకు అందిందన్నారు. విషయం తెలుసుకుని పోలీసులు అక్కడకు చేరుకుని విచారిస్తుండగా వేలు, అతని కుమారులు పోలీసులపై దౌర్జన్యం చేశారన్నారు. వారిపై ఐపిసి సెక్షన్ 353కింద కేసు నమోదు చేశామన్నారు. అలాగే కృష్ణమూర్తి మెడపై నరికిన మణిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు.

## రైల్వే బ్రిడ్జ్ పై విజయవంతంగా శ్రీనివాససేతు గెడ్డెర్లు ఏర్పాటు

తిరుపతి కార్పొరేషన్, జూలై 2, ప్రభాతవార్త



తిరుపతి శ్రీనివాస సేతు తుది దశ పనుల్లో భాగంగా రామానుజ సర్కిల్ నుండి ఆర్టీసి బస్ స్టాండ్‌ను కలుపుతూ రైల్వే లైన్ పై రెండు మార్గాలను కలుపుతూ నిర్మిస్తున్న బ్రిడ్జి పనుల్లో ఐరన్ గెడ్డర్లను అమర్చే ప్రక్రియలో భాగంగా ఆదివారం ఉదయం రెండు గెడ్డెర్లను విజయవంతంగా ఏర్పాటు చేయడం జరిగింది. గెడ్డర్ అమరిక పనులను తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి, రైల్వే అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ రైల్వే లైన్ పై వున్న శ్రీనివాస సేతు బ్రిడ్జ్‌ను కలిపే కీలక ప్రక్రియలో అతి భారీ ఆరు ఐరన్ గెడ్డెర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ముఖ్యమైన రైల్వే బ్రిడ్జ్ కేంద్రీకృత స్థానంపై ఆదివారం ప్రధానమైన రెండు అతి పెద్ద ఐరన్ గెడ్డెర్లను అధికారులు విజయవంతంగా అమర్చడం జరిగిందని మరో నాలుగు గెడ్డెర్లు అమర్చితే ఈ స్థానంలో పనులు పూర్తి అవుతాయని, ఆ పనులు కూడా రైల్వేవారి సహకారంతో మరో పదిహేను రోజుల్లో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, కార్పొరేటర్ లడ్డు భాస్కర్, తిరుపతిరైల్వేస్టేషన్అధికారులుకుప్పాల సత్యనారాయణ,కృష్ణ,సుబ్బారావు,ఆప్కొన్‌స్వామి పాల్గొన్నారు.

## ఛలో హైదరాబాద్ సన్నాహక సభను విజయవంతం చేయండి

- రాష్ట్ర ఎంఎస్‌పి నాయకులు మందా పెంచలయ్య

కోట, జూలై 2 ప్రభాతవార్త

ఛలో హైదరాబాద్ సన్నాహక సభను జయప్రదం చేయాలని రాష్ట్ర ఎంఎస్‌పి నాయకులు మందా పెంచలయ్య పిలుపునిచ్చారు. ఆదివారం కోటలో ఆయన ఛలో హైదరాబాద్ సన్నాహక సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కల్పించడానికి డిమాండ్ చేస్తూ ఛలో హైదరాబాద్ సన్నాహక సభ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. అందుకుగాను ఈ నెల 10వ తేదీన నాయుడుపేటలో ఎంఆర్‌పిఎస్ వ్యవస్థపక అధ్యక్షుడు మంద కృష్ణ విచ్చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో ఉన్న మాదిగ పెద్దలు, విద్యార్థులు, మహిళలు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం గూడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మంద రవి మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి జరిగే పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని బిజెపి పెద్దలు చెప్పారని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలుపరచకపోతే రానున్న ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకుడు గొల్లపల్లి సిసింద్రి మాదిగ, సూళ్లూరుపేట ఇన్‌ఛార్జ్ కుక్క మల్లిరవి మాదిగ, ఎన్‌ఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, మునీష, కోట మండల నాయకులు వెంకటయ్య, మాధవ్, చేజర్ల కృష్ణయ్య, సుధాకర్, పెంచలయ్య, నాగయ్య, కోట, నందిపాకం మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమాలు ఆధ్యాత్మిక నిలయాలు: శాంతికి చిహ్నాలు

బండారుపల్లి కృష్ణాశ్రమం 44వ వార్షికోత్సవం

ఏర్పేడు (శ్రీకాళహస్తిరూరల్), జూలై 2 ప్రభాతవార్త



ఆశ్రమాలు ఆధ్మాత్మిక నిలయాలని శాంతి చిహ్నాలని ఆదివారం బండారుపల్లి కృష్ణాశ్రమం 44వ వార్షికోత్సవ సభలో పలువురు పీఠాదిపతులు సూచించారు. ఆశ్రమం వార్షికోత్సవానికి ముఖ్యవక్తగా శ్రీకాళహస్తిలోని శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి హాజరై సందేశం ఇచ్చారు. ముఖ్యఅతిధిగా ప్రముఖ ఆధ్మాత్మిక వేత్త, పారిశ్రామిక వేత్త రాచగున్నేరి మాజీ సర్పంచ్ బొల్లినేని జగన్నాధం నాయుడు హాజరయ్యారు. వక్తలుగా వివిధ ఆశ్రమాలకు చెందిన శివానంద గిరి స్వామి, స్వస్వరూపానందగిరి స్వామి, రామకృష్ణనంద స్వామి, సర్వాత్మనందస్వామి, కేశవానందస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా పీఠాదిపతులు మాట్లాడుతూ నేడు సమాజంలో రుగ్మతలతో అశాంతి చోటు చేసుకుంటుందన్నారు. ఏ కుటుంబం చూసినా సమస్యలతో సతమతమౌతున్నారు. లక్షలు సంపాదిస్తున్నా ప్రశాంతంగా గడిపే పరిస్థితి లేదన్నారు. మనం సంపాదనలో పడి మనల్ని నడిపే భగవంతుని విస్మరిస్తున్నామన్నారు. మనం ఎప్పుడైతే దైవారాధనను విస్మరిస్తున్నామో మనకు మానసిక ప్రశాంతత కొరవడుతుందని స్వాములు తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. ఏర్పేడు మండలం ఆధ్మాత్మికతకు నిలయంగా ఉందన్నారు. బొల్లినేనికి

**సన్మానం:** ఆశ్రమ వార్షికోత్సవం సందర్భంగా ముఖ్యఅతిధిగా వచ్చిన బొల్లినేని జగన్నాధం నాయుడును పీఠాధిపతులు ఆశ్రమం తరఫున సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమాలతో మన సంప్రదాయాలు, సంస్కృతికి సంబంధించి భావి తరాలకు వివరించటమే కాకుండా ధార్మికతను గురువులు వివరించి సన్మార్గంలో నడవటానికి దోహద పడతారని వివరించారు. ఆశ్రమ అభివృద్ధికి తన చేతనైనంత సహాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమాలకు మాజీ మండలాధ్యక్షుడు వెంకటరెడ్డి, ఆధ్యాత్మిక పత్రిక ఎడిటర్ పి.దొరస్వామి రెడ్డి, స్వాగతం పలికారు. ధార్మిక సభ అనంతరం సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసారు.

## ఎస్‌సివికి సన్మానాలు:దేశంకు వెన్నుదన్ను

శ్రీకాళహస్తి, జూలై 2 ప్రభాతవార్త



తిరుపతిజిల్లా శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లో నిస్తేజంగా, నిస్సహాయంగా ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తల్లో మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు పార్టీలో పునరాగమనంతో ఉత్సాహం ఉరకలేస్తుంది. ప్రతి రోజూ ఆయన్ను కలసి అభినందిస్తున్నారు. సత్కరిస్తున్నారు. ఆయన నిర్ణయాన్ని అభినందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సత్యవేడు, వెంకటగిరి నియోజకవర్గాలకు చెందిన యువకులు వచ్చి ఆయన్ను కలసి సత్కరించారు.

***పార్టీ విజయానికి సమాయత్తమవ్వండి:***

మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడును కలుస్తున్న కార్యకర్తలకు దిశ దేశ నిర్దేశం చేస్తూ నేడు రాష్ట్రాభివృద్ధికి రాష్ట్రాన్ని కాపాడుకోవటానికి సమర్థవంతుడైన ముఖ్యమంత్రి అవసరం ఎంతైనా ఉందన్నారు. విజన్ ఉన్న నాయకుడు మన తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు అన్నారు. ఆయన్ను ముఖ్యమంత్రి చేయటానికి ప్రతి నియోజకవర్గంలో మన పార్టీ గెలవాల్సి అవసరం ఉందన్నారు. ఆదివారం సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్, ప్రధాన కార్యదర్శి పార్థివన్, క్లస్టర్ ఇంచార్జి ఎం,డి కుమార్, మండల ఇన్‌చార్జి నెల్సన్ మండేలా, యువత నాయకుడు తిరుపతి తదితరులున్నారు. కాగా వెంకటగిరి నియజకవర్గానికి చెందిన పలువురు ప్రముఖులు ఆదివారం ఆయన్ను సత్కరించారు. పోలేరమ్మ దేవస్థానం మాజీ ఛైర్మెన్ చంద్రారెడ్డి, నరసింహులు, మాజీ కౌన్సిరల్ సురేంద్ర తమ సహచరులతో ఎస్‌సివి నాయుడును సత్కరించారు.

## బాపట్ల ఆలయానికి శ్రీకాళహస్తి టేకు తలుపు

శ్రీకాళహస్తి, జూలై 2 ప్రభాతవార్త



శ్రీకాళహస్తికి చెందిన దారుశిల్ప కళాకారుల ప్రతిభా పాటవాలకు తిరుగులేదు. వారి కళాచాతుర్యం వర్ణించనలవి కానిది. ఈ నేపథ్యంలో బాపట్లలో నూతనంగా శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయానికి సంబంధించి తలుపులను తయారు చేసి ఇవ్వటానికి శ్రీకాళహస్తికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త ,క్షత్రియుడు, కమిటి సభ్యులు కె.చంద్రరాజు రూ.5లక్షల విలువ చేసే ద్వారాన్ని అందించారు. ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు సూచన మేరకు చంద్రరాజు ప్రత్యేక శ్రద్ధ వహించి టేకు తో తలుపులను తయారు చేసి అందించారు. చంద్రరాజు గతంలలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీరామమందిరాలకు కూడా విరాళంగా అందించారు. ఆయన్ను పలువురు అభినందించారు.

## కోలా ఎంఎల్‌ఏ కావాలని మొక్కులు తీర్చుకున్న భక్తులు

.శ్రీకాళహస్తి, జూలై 2 ప్రభాతవార్త



భారతీజనతాపార్టీ రాష్ట్ర మీడియా ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోలా. ఆనంద్‌కుమార్ ఎంఎల్‌ఏ కావాలని కోరుతూ శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయంగా ఉన్న ద్రౌపతీదేవి సమేత ధర్మరాజులస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం సాయంత్రం జరిగిన అగ్నిగుంట ప్రవేశంలో భారతీజనతాపార్టీ మహిళలు మల్లీశ్వరమ్మ, అధ్యక్షురాలు సుశీలమ్మ, హేమా, సబితా, లలిత, కవిత, నాగమ్మ, లక్ష్మి, గురమ్మ, భవానీ, ఇంద్రమ్మ, సుబ్రమణ్యం, మారుకొండయ్య, గోకుల్‌కుమా ర్‌లతో పాటు సుమారు 15మంది అగ్నిగుండ మహోత్సవంలో పాల్గొని మొక్కులుతీర్చుకున్నారు. తమ నాయకుడు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎంఎల్‌ఏ కావాలని కోరారు.

# చక్కటి ఏర్పాట్లు: స్నానాలకు ప్రత్యేక ఏర్పాట్లు

## ఛైర్మెన్ చొరవ: భక్తుల ప్రశంస

శ్రీకాళహస్తి, జూలై 2 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ఆలయాల్లో ద్రౌపదీసమేత ధర్మరాజుల ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉత్సవాలకు ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ప్రత్యేక శ్రద్ధ వహించారు. మూడు రోజులుగా ఆలయం వద్దనే తిష్టవేసి ఓ వైపు దుర్యోధన దుశ్శాసన వధ, మరో వైపు పొంగళ్ళకు ఏర్పాట్లు చేసారు. అలాగే పోలీసులతో చర్చించి ట్రాఫిక్‌ను మళ్ళించుటకు చొరవచూపారు. అంతేకాక ఉత్సవాలలో సమయపాలనకు ప్రాధాన్యత ఇచ్చారు. ధర్మరాజుల స్వామి తిరునాళ్ళ సందర్భంగా నిర్వహించే అగ్నిగుండ ప్రవేశానికి గతంలో సువర్ణముఖి నదిలో స్నానమాచరించే వారు. అయితే అది దూరం కావటంతో దేవస్థానం ఇఓ కెవి సాగర్‌బాబు భక్తుల సౌకర్యార్థం వైష్ణవ కోనేరులో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అయితే ఇక్కడ ముందుజాగ్రత్తగా దేవస్థానం బోర్డులు ఏర్పాటు చేసింది. కోనేరులో దిగరాదని గట్టు మీద స్నానాలు ఆచరించాలని సూచనల బోర్డులు ఏర్పాటు చేసింది. ఈ కోనేరులో ఏర్పాటు ఎంతో ఉపయోగకరంగా మారింది.



మహిళలకు ప్రవేశం:

గతంలో ధర్మరాజుల తిరునాళ్ల సందర్భంగా అగ్నిగుండ ప్రవేశం రోజు మహిళలకు అగ్ని స్నానమాచరింపజేశారు. కొందరు మొక్కులు తీర్చుకోటానికి మరికొందరు సంతానం కోసం అగ్ని స్నానమాచరించే వారని వృద్ధులు చెబుతున్నారు. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా సంప్రదాయాల్లో కూడా మార్పులువచ్చాయి. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. కాబట్టి అగ్నిగుండ ప్రవేశానికి ఎందుకు అనర్హులని భావించి వారికి కూడా ప్రవేశం కల్పించారు. దాంతో ఆదివారం మహిళలు విశేషసంఖ్యలో పాల్గొన్నారు.

**ట్రాఫిక్ మళ్లింపు:**

ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అర్జున తపస్సు రోజు నుంచి పట్టణంలో జనం చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి తండోపతండాలుగా తరలివచ్చారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం కల్గకుండా మందు జాగ్రత్త చర్యగా డివైయస్‌పి బీమారావు, సిఐ మల్లికార్జున్ వారి సిబ్బంది పోలీసులు ఉదయం నుంచి చెన్నై నుంచి వచ్చే బస్సులను సాయిబాబ మందిరం వద్ద నుంచి ఆస్పత్రి మీదుగా మళ్లించారు. పట్టణంలోని బిక్షాల గాలిగోపురం నుంచి ధర్మరాజుల గుడి వరకు సుమారుమూడు కిలో మీటర్ల వరకు పూలదుకాణాలు, వివిధ ఆట వస్తువుల దుకాణాలు, రకరకాల మజిలి దుకాణాలు ఉన్నాయి. అంతేకాక వినోదం కోసం పలు సర్కస్‌లు, రంగుల రట్నాలు రావడంతో ఇదో మేళగా మారింది. అగ్నిగుండ కార్యక్రమాల్లో ఎలాంటి విఘ్నాలు, ఇబ్బందులు ఏర్పడకుండా ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు విఇ సాగర్‌బాబు, ఇఇ నూకారత్నం వారి సిబ్బంది పర్యవేక్షించారు.

# తిరుపతి డివిజన్

## నేడు సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి పూజలు

పుత్తూరురూరల్, జూలై 2 ప్రభాతవార్త:



పుత్తూరు మండల పరిధిలోని తిమ్మరాజు కండ్రిగ గ్రామంలోవెలసిన సద్గురు శ్రీశ్రీశ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో సోమవారం గురు పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో ఉదయం 6 గంటలకు కాకడ హారతి 8 గంటల నుంచి గణపతి పూజ, సిద్ధి పుణ్యవచనం, గురు మండల కలుస్తాపన గురు మండల నవావరణ పూజ గణపతి నవగ్రహ హోమం, గురు మండల హోమం మధ్యాహ్నం 12 గంటలకు షిరిడీ సాయిబాబా రుద్రాభిషేకం, మహా పూర్ణాహుతి మధ్యాహ్నం 12.30 గంటలకు మధ్యాహ్న హారతి, ఒక గంటకు అన్న ప్రసాదం, సాయంత్రం 6 గంటలకు సత్సంగం, సాయంత్రం దూపారతి, రాత్రి 8 గంటలకు క్షేత్ర నిర్వహించినట్లు ఆచార్యుల ఆధ్యాత్మిక కేంద్రం వారు తెలిపారు.

## పులివర్తి నాని విజయమే మనందరి లక్ష్యం..!

కాలనీల సమగ్రాభివృద్ధికి కట్టుబడివున్నాం..!

అపరిచిత వ్యక్తుల ఓట్లను గుర్తించండి..!

టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి

చంద్రగిరి, జూలై 2 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పులివర్తి నాని విజయమే మనందరి లక్ష్యమని టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి అన్నారు. స్థానిక బిడీ కాలనీ, వికలాంగుల కాలనీ, జోగుల కాలనీలకు సంబంధించిన బూత్ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో ఆదివారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆవాసాలు కాలనీలను సమగ్రాభివృద్ధి చేయడానికి కట్టుబడివున్నట్లు తెలిపారు. మీ కాలనీలలో ఓటర్ల జాబితాలను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలన్నారు. కొత్తగా చేరే ఓటర్లు ఎవరనే విషయాన్ని పసిగట్టి అపరిచిత వ్యక్తులవైతే పార్టీ దృష్టికి తీసుకురావాలన్నారు. అంతకుముందు తమ అభిమాన నాయకురాలు కాలనీకి రానున్నట్లు సమాచారం అందుకున్న ముస్లీమ్ మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టిడిపిచే పేదలకు అన్నదానం

చంద్రగిరి, జూలై 2 ప్రభాతవార్త:



చంద్రగిరి వారపు సంతలో నిరుపేదలకు టిడిపి వారిచే పేదలకు అన్నదానం చేశారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని ఆదేశాల మేరకు ఆదివారం టవర్ క్లాక్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్న క్యాంటీన్ తరహా భోజనాన్ని పేదలకు ప్రతి ఆదివారం అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వారపు సంతకు వచ్చే పేదలకు చెవిరెడ్డి అన్నదానం

వైసిపి పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి

చంద్రగిరి, జూలై 2 ప్రభాతవార్త:



వారపు సంతకు వచ్చే పేదవారికి ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నదానం జరిపించారని వైసిపి పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద ఆదివారం వైసిపి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు తనవంతు సేవలందించడంలో ఎంఎల్‌ఏ ఎల్లప్పుడూ ముందు వుంటారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అఖిల భారతీయ కార్యకారిణి రామ్ మాధవ్‌కు ఘన సత్కారం

తిరుపతి కలెక్టరేట్, జూలై 2, ప్రభాతవార్త



అఖిల భారత కార్యకారిణి రామ్ మాధవ్ ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ గురుపూజోత్సవానికి రాహుల్ కన్వెన్షన్ హాలుకి విచ్చేసిన రామ్ మాధవ్‌కి బిజేపి జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపినాధ్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికి సత్కారం చేసారు. ఈ కార్యక్రమంలో బిజేపి తూర్పు మండల ఉపాధ్యక్షుడు తొండమనాటి సుబ్రమణ్యం రెడ్డి, బిజేపి సీనియర్ నాయకులు పొనగంటి భాస్కర్ దాస్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ల చోరీతో రైతులకు తప్పని తిప్పలు

విజయపురం, జూలై 2 ప్రభాతవార్త :



మండలంలోని ఇల్లత్తూరులో వరుసగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతుండడంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఆరు నెలల కాలంలో గ్రామంలో సుమారు పది ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. వరుస చోరీలు జరుగుతున్నా అటు విద్యుత్ శాఖాధికారులు ఇటు పోలీసు అధికారులు పట్టించుకోకపోవడంతో దొంగలు మరింత రెచ్చిపోయి మోటారు కేబుల్స్, స్టాటర్లను కూడా చోరీ చేసేస్తున్నారు. దీని వల్ల గ్రామంలో సుమారు 16 మంది రైతులకు కరెంట్ కష్టాలు తప్పడం లేదు. ఒక పక్క పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరుకు ఇంకొన్ని రోజులు పడుతుందని విద్యుత్ శాఖాధికారులు చెబుతుండడంతో చేసేదేమీ లేక రైతులు ఆవేదన చెందుతున్నారు. దీనిపై అధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

## మిట్టకండ్రిగలో వైభవంగా గంగమ్మ కొలువు

విజయపురం, జూలై 2 ప్రభాతవార్త :

మండలంలోని కళియంబాకం మిట్టకండ్రిగలో ఆదివారం గంగమ్మ కొలువును వైభవంగా నిర్వహించారు. వీధుల్లో వేప తోరణాలు, విద్యుత్ దీపాలను అలంకరించారు. ఉదయం అమ్మవారికి అంబలి పోసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

## కలికిరిండ్లు శేఖర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన డాక్టర్ థామస్

కార్వేటినగరం, జూలై 2 ప్రభాతవార్త:



కార్వేటినగరం మండలం ఆర్‌కెవిబిపేట పంచాయితి పరిధిలోని కలికిరిండ్లు గ్రామంలో ఇటీవల శేఖర్‌రెడ్డి (డూండీ) మరణించారు. శేఖర్‌రెడ్డి కుటుంబాన్ని జిడినెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ పరామర్శించి వారి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. డాక్టర్ థామస్‌కు కలికిరిండ్లు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కార్వేటినగరం మాజీ వైస్ ఎంపిపి రవికుమార్, స్వగృహంలో డాక్టర్ థామస్ భేటీ అయ్యారు. రవికుమార్‌తో పలు అంశాలు చర్చించారు. కార్యక్రమంలో నాయకులు రాజేంద్రరెడ్డి, హేమంత్‌రెడ్డి, గుండయ్య, సోము, కలికిరిండ్లు గ్రామస్తులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## వేపగుంట జడ్పీ హైస్కూలు పూర్వ విద్యార్థుల విహారయాత్ర

పుత్తూరురూరల్, జూలై 2 ప్రభాతవార్త:



1983లో వేపగుంట జడ్పీ హైస్కూలులో చదివిన పూర్వ విద్యార్థులు 40 సంవత్సరాలు పూర్తిచేసుకుని 22 మంది వేపగుంటస్కూలు నుంచి విహారయాత్ర తలకోన, కల్యాణి డ్యాం, పరిసరాలు విహారయాత్రగా వెళ్లారు. ఇక ప్రతిసంవత్సరం జూలై 1వతేదీ అందరూ కలుసుకోవాలని మంచి కార్యక్రమాలు జరపాలని వారు ఒకరిని ఒకరు కలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు.

## త్వరలో ప్రజాసేవకుడిగా అందుబాటులో వస్తా

– మాజీ జడ్పీఛైర్మన్ సుబ్రమణ్యంరెడ్డి



**కుప్పంరూరల్, జూలై 2 ప్రభాతవార్త**

త్వరలోనే మంచి నిర్ణయం తీసుకుని ప్రజాసేవకుడిగా అందుబాటులో వస్తానని మాజీ జడ్పీఛైర్మన్ ఎం.సుబ్రమణ్యంరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన జన్మదిన వేడుకలను అనుచరులు ఘనంగా నిర్వహించారు. ప్రజాసేవలోకి మళ్లీ రావాలని అనుచరులు ఎంఎస్ఆర్‌ను కోరారు. కార్యక్రమంలో వెండుగంపల్లి సర్పంచ్ ధర్మ, పిఎస్ సతీష్‌కుమార్, పిజి సెల్వం, సుబ్బన్న, మోహన్, సంతోష్, హరి, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌డి ఆస్పత్రిచే ఉచిత మెగా వైద్య శిబిరం



**రామకుప్పం, జూలై 2 ప్రభాతవార్త**

కుప్పం బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి అధినేత డా॥ బిఆర్ సురేష్‌బాబుచే మండలంలోని వీర్నమలలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 180మందికి డా॥ సురేష్‌బాబు, డా॥ హరిత బిపి, మధుమేహం, ఇసిజి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగామందులు, మాత్రలు పంపిణీ చేశారు వైద్యులు బిందు ప్రియాంక, హేమంత్, సతీష్, సిబ్బంది భూపతి, పాండియన్, గోవిందరాజులు, డా॥ వెంకటేష్ పాల్గొన్నారు.

## భవిష్యత్తుకు గ్యారెంటీ పోస్టర్ల ఆవిష్కరణ



**శాంతిపురం, జూలై 2 ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ చేపట్టే భవిష్యత్తుకు గ్యారెంటీ పోస్టర్లను ఆదివారం మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు భవిష్యత్తుకు గ్యారెంటీ పేరిట ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను జనంలో విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. కుప్పంలో చంద్రబాబుకు లక్ష మెజారిటీ సాధనకు పని చేస్తామన్నారు. కార్యక్రమంలో నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్‌కుమార్, ఎల్.జయరాంరెడ్డి, మణి, రమేష్, నాగరాజు, శంకర్, సింగిరి శ్రీనివాసులు, చంద్రరాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నగదు, మెమెంటో వితరణ



**పుత్తూరురూరల్, జూలై 2 ప్రభాతవార్త:** ప్రాథమిక, భవిత పాఠశాల విద్యార్థులకు కావలసిన విద్యా, వస్తు సామగ్రిని లక్షలాది రూపాయల ఖర్చుతో సమాజం అందించడం అభినందనీయమని విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి యుగంధర్‌రాజు అన్నారు. ఆయన పుత్తూరు ప్రధాన పాఠశాలలో జరిగిన శ్రీసరస్వతీ మాతా సాంఘిక సేవా సమాజం విద్యా ఉపకరణాలు, 10వ తరగతి ర్యాంకు విద్యార్థులకు నగదు బహుమతి వితరణ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తూ మరెన్నో మంచి పనులను సమాజ సభ్యులు చేస్తారని ఆశాభావం వ్యక్తపరచారు. ముఖ్య అతిథులుగా తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్, పుత్తూరు డివిజనల్ విద్యాశాఖ అధికారి రఘురామయ్య చేతుల మీదుగా వితరణ దాతలతో కలసి మండలస్థాయి ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకర్లకు పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకర్లకు నగదుతో పాటు మెమెంటోలు అందజేశారు. అనంతరం ఉప విద్యాశాఖ అధికారి రఘురామయ్య, మండల విద్యాశాఖ అధికారి తిరుమలరాజు, బాలసుబ్రహ్మణ్యం చేత సమాజ సభ్యులు పుత్తూరు మండ లంలో ఏడు పాఠశాలలకు విద్యా సామగ్రిని అందజేశారు. అలాగే సేవా సమాజం హాజరైన సభ్యులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలోసమాజం సభ్యులు మాడా ప్రసాద్, పార్థసారథి, వినోద్ బాబు, కె.ఎస్.ప్రసాద్‌బాబు, బాలసుబ్రహ్మణ్యం, అమర్‌నాథ్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, పి.వి.సుబ్రహ్మణ్యం, రామకృష్ణమరాజు, వెంకటరత్నం, మురళి, సుబ్రహ్మణ్యం, దొరస్వామి, మండలాల నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సిత్రాలు చూడండహో....

నిబంధనలు తుంగలో తొక్కిన ఎస్‌బీఐ అధికారులు



**రేణిగుంట, జూలై 2 ప్రభాతవార్త:**

రేణిగుంట స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో స్టేట్ బ్యాంకుల ఆవిర్భావ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖులు, ఖాతాదారుల సమక్షంలో బ్యాంకు అధికారులు కేక్ కట్‌చేశారు. ఇంత వరకు బాగానే ఉంది ఇక్కడే ఒక మెలిక దాగి ఉంది. బ్యాంకు వద్ద ఖాతాదారులకు సమస్యలు ఏర్పడితే ఖాతాదారుల అభ్యర్థన మేరకు విలేకరులు వెళ్లితప బ్యాంక్ సెక్యూరిటీ, అధికారులు విలేకరులపై వాగ్వాదానికి దిగి బ్యాంకు ఆవరణలో ఫోటోలు తీయకూడదంటూ పెద్ద గొడవ చేసిన సంఘటనలు గతంలోజరిగాయి. విలేకరుల చేతుల్లోని సెల్‌ఫోన్లను లాక్కొని ఫోటోలను డిలీట్ చేస్తారు. ఫోటోలు, వీడియోలు తీయకూడదన్న సూచిక బోర్డు చపించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బెదిరిస్తారు. ఈ నియమాలు బ్యాంకు అధికారులకు వర్తించవా...? బ్యాంకు అధికారులకు ఒక చట్టం ఇతరులకు మరొక చట్టమా...? బ్యాంకు అధికారుల సిత్రాలు చూడండహో అంటూ పలువురు నవ్వుకుంటున్నారు.

## నిట్‌లో సదుం విద్యార్థి ప్రతిభ



**సదుం, జూలై 2 ప్రభాతవార్త**

మండల పరిదిలోని జాంద్రపేటకుచెందిన ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి, సరళ దంపతుల కుమారుడు స్వాతిక్ రెడ్డి ఎన్ఐటీ(నిట్)లో ఉత్తమ ప్రతిభ కనరచాడు. ఇటీవల జరిగిన జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో అతను 99.1పర్సంటైల్‌తో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాలేజీ బిట్స్ పిలానీలో బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్‌లో అడ్మిషన్ పొందాడు. విద్యార్థిని, విద్యార్థి తల్లిదండ్రులనుపలువురు ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినిందించారు.

## అట్టహాసంగా మాజీ మంత్రి అమరనాథరెడ్డి జన్మదిన వేడుకలు

-అధిక సంఖ్యలో తరలివచ్చిన అభిమానులు

-ప్రతిపక్ష నాయకుడు అయినప్పటికీ ఆధరణ బేష్



**పలమనేరు, జూలై 02, ప్రభాతవార్త:**

మండలంలో ఆదివారం అట్టహాసంగా మాజీ మంత్రి అమరనాథరెడ్డి జన్మదిన వేడుకలను టిడిపి శ్రేణులు ,అభిమానులు నిర్వహించారు. ఉదయం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ నుండి అధిక సంఖ్యలో టిడిపి శ్రేణులు, ఆయన అభిమానులు భారీ ర్యాలీ నిర్వహించారు. భారీ పండ్లతో ఏర్పాటు చేసిన గజమాల, పూలమాలలో ఆయనను సత్కరించారు. ఆర్టీసి బస్టాండ్ వద్ద క్రిస్టల్ సాల్ట్‌తో ఆయన చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి 1116 టెంకాయలను కొట్టి వారి అభిమానాన్ని చాటుకున్నారు. ఆయన నివాసం వద్ద అమరనాథరెడ్డి చిత్రపటం పొందుపరచిన 64 అడుగుల (200కేజీల) భారీ కేక్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో లేనప్పటికీ తనపై అభిమానంతో అధిక సంఖ్యలో అభిమానులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావడం చూస్తుంటే ఈ ప్రజలకు నేను ఎంతో రుణపడి ఉన్నానని తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి నిత్యావసరాలు పంపిణీ



**కుప్పం, జూలై 2 ప్రభాతవార్త**

కుప్పం సమాచారం సొసైటీ సభ్యులు మరోమారు తమ ధాతృత్వాన్ని చాటుకున్నారు. కుప్పం మున్సిపల్ పరిధి ఎన్టీఆర్ కాలనీకి చెందిన అఫ్జల్ గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో ఆదివారం అతని కుటుంబానికి కుప్పం సమాచారం సొసైటీ సభ్యులు నెలరోజులకు సరిపడా నిత్యావసర సరుకులను తమవంతుగా అందించారు. భవిష్యత్తులో సైతం తాము మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడ్తామన్నారు. కార్యక్రమంలో రాజువేలు, గని ఉల్లా, మతీన్, ఖలీమ్, ఏజాస్, ఇస్మాయిల్, పటేల్ బాబు, సోము, షబ్బీర్, గురుస్వామి, ఉస్మాన్ పాల్గొన్నారు.

## చంద్రబాబుకు లక్ష మెజార్టీ సాధించాల్సిందే



**కుప్పంరూరల్, జూలై 2 ప్రభాతవార్త**

వచ్చే ఎన్నికల్లో తెదేపా అధినేత చంద్రబాబునాయుడుకు కుప్పంలో లక్ష మెజార్టీ సాధించి తీరాలని తెదేపా వన్నియకులక్షత్రియ కులస్తులు పేర్కొన్నారు. ఆదివారం వన్నియకులక్షత్రియ యువత అధ్యక్షుడు ప్రకాష్, యువత అధ్యక్షుడు సుబ్బు అధ్యక్షతన మండలంలోని శ్రీ బేటరాయస్వామి కమ్యూనిటీ హాలులో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చంద్రబాబునాయుడు ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారెంటీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లో బలంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు. అలాగే క్షత్రియుల అభివృద్ధికై భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు మురళి, ఐటిడిపి శరవణ, అధికార ప్రతినిధి అశోక్, నేతలు సతీష్, గోపి, గణేష్, ఈశ్వర్, సురేష్, దాము, పువి, కంగుంది సర్పంచ్ ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి అమర్‌ను సత్కరించిన కుప్పం నేతలు



**కుప్పంరూరల్, జూలై 2 ప్రభాతవార్త**

మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డిని కుప్పంకు చెందిన తెదేపా నేతలు ఘనంగా సత్కరించారు. ఆదివారం మాజీ మంత్రి అమర్ జన్మదినం సందర్భంగా ఆయనను వారి స్వగృహంలో కలసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జిమ్‌దాము, నేతలు ఉమాపతి, ఐటిడిపి నరేష్, మణి గోపాల్ పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అంతరాష్ట్ర దొంగ అరెస్ట్: 22 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



**తవణంపల్లె, జూలై 2 ప్రభాతవార్త:**

పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను దొంగలించే అంతరాష్ట్ర దొంగను అరెస్ట్ చేసి సుమారు 20 లక్షల రూపాయలు విలువగల 22 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి, తవణపల్లె ఎస్సై పి.వి.సుధాకర్‌రెడ్డిలు తెలిపారు. ఆదివారం వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. గత కొద్ది రోజులుగా తవణంపల్లె, బంగారుపాళ్యం, చిత్తూరు తదితర మండలాలు, చుట్టు పక్కల ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల దొంగతనాలు ఎక్కువగా జరుగుతుండడంతో జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో సీఐ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం స్థానిక ఎస్సై సుధాకర్‌రెడ్డి, సిబ్బంది పట్నం గ్రామ సమీపంలోని ఫ్లైవర్ వద్ద యాదమరి మండలం కీనాటంపపల్లె గుట్టకింద ఎస్సీ వాడకు చెందిన సి.గోవిందరాజ్(29) అనే వ్యక్తిని అరెస్ట్ చేసి విచారించినట్లు తెలిపారు. ఈమేరకు అతని వద్ద నుండి తవణంపల్లె, బంగారుపాళ్యం, చిత్తూరు వన్‌టౌన్, జీడి నెల్లూరు, ఎస్ఆర్.పురంలతో వివిధ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో దొంగలించిన 22 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు 20 లక్షల రూపాయలు వుంటుందని సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్సై సుధాకర్‌రెడ్డిలు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని నిందితుని రిమాండుకు తరలించినట్లు తెలిపారు. ఈకేసులో పాల్గొన్న ఎస్సై, సిబ్బందిని సీఐ అభినందించారు.

## గణనాధుని దర్శించుకున్న పలువురు ప్రముఖులు



**కాణిపాకం, జూలై 2 ప్రభాతవార్త:**

సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఈమేరకు రాష్ట్ర ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ మల్లిఖార్జునరెడ్డి, రాష్ట్ర ఎస్సీ కమీషన్ మెంబర్ పుల్లారావులు వేర్వేరుగా స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాద లతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్‌లు రంగస్వామి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాబు, సురేష్‌లతో పాటు ఎస్సీసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌సివైచే రూ. 10వేల ఆర్థికసాయం



**చౌడేపల్లి, జూలై 2 ప్రభాతవార్త**

ప్రత్యేక అవసరాలగల వ్యక్తికి ఆర్‌సిఐ సంఘంచే రూ. 10వేల ఆర్థికసాయం చేసారు. మండలంలోని కొండయ్యగారిపల్లి పంచా యతీ ఎస్.అగ్రహారంకు చెందిన ప్రత్యేక అవసరాలుగల టి.సుబ్ర మణ్యం ఇటీవల ప్రజా నాయకుడు బి.రామచంద్ర యాదవ్‌ను కలిశాడు. అతని పరిస్థితిన చూసిన ఆయన చౌడేపల్లి ఆర్‌సివై సంఘ నాయకుడు డాక్టర్ మహేష్‌బాబు ద్వారా రూ. 10వేల నందించాడు. ఆర్‌సివై చౌడేపల్లి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## దొంగ అరెస్టు.. బంగారు నగలు స్వాదీనం



**రొంపిచెర్ల, జూలై 2ప్రబాతవార్త**

బంగారు నగలు చోరీ చేసిన దొంగను పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు బండకింద పల్లె గ్రామ పంచాయతీ కమ్మోళ్లపల్లెకు చెందిన శివరాణి జూన్ 26న బందువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఎవరూలేరని తెలుసుకున్న ఐరాల మండలం గాండ్లపల్లె ఎస్‌టీ కాలనీకి చెందిన రాజు ఆ ఇంటి తలుపులుపగులగొట్టి ఇంటల్లో బీరువాలో ఉన్న 18 గ్రాముల నగలను చోరీచేశాడు. 30వ తేదీ ఇంటికి వచ్చిన శివరాణి ఇంట్లో దొంగలు పడ్డారని గుర్తించారు. రొంపిచెర్ల పోలీసులకుపిర్యాదు చేశారు. పోలీసులు వేలి ముద్రలను సేకరించి దర్యాప్తు చేయగా రాజువిగా గుర్తించారు. అతను అన్నమయ్యజిల్లా పీలేరు క్రాసులో ఉండగా అరెస్టు చేశారు. అతనివద్ద నుంచి 18 గ్రాముల బంగారు నగలను స్వాదీనం చేసుకున్నారు. నిందితుడిని పీలేరు కోర్టుకు హాజరు పరచనున్నట్లు చెప్పారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## వెంకటగిరి ప్రజలకు సేవలందిదించడమే లక్ష్యం

– వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



**వెంకటగిరి, జులై 2, ప్రభాతవార్త:**

నియోజకవర్గ ప్రజలకు సేవలందించడమే తన లక్ష్యమని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో ప్రజల నుంచి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. తన ఇంటి వద్దకు సమస్యలు తెలుపుకునేందుకు ఏ సమయంలోనైనా ప్రజలు రావచ్చునని తెలిపారు. తండ్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, తల్లి రాజ్యలక్ష్మిలు నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారని అందరూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చెబుతుంటే చాలా ఆనందంగా ఉందన్నారు. తాను కూడా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు. ప్రజా సేవకే తన జీవితం అంకితం చేస్తానని తెలిపారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇన్ని పథకాలు లేవని తెలిపారు. ప్రజా సేవ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఆయన వెంట వైసీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు సురేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కడప బ్రహ్మయ్య, పోలేరమ్మ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ పులి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సేవకే జీవితం అంకితం

– డాక్టర్ మస్తాన్ యాదవ్



**వెంకటగిరి, జులై 2, ప్రభాతవార్త:**

ప్రజా సేవకే తన జీవితాన్ని అంకితం చేస్తానని డాక్టర్ మస్తాన్ ట్రస్ట్ చైర్మన్, టీడీపీ నేత బొలిగర్ల మస్తాన్ యాదవ్ తెలిపారు. ఆదివారం జన్మదినం సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల నడుమ కేక్ కట్ చేసి ఆయన సంబరాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వెంకటగిరి వాసులకు తన వంతు సేవలందించాలని రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. వైద్య వృత్తి ద్వారా కొంత సేవ అందిస్తున్నట్లు, రాజకీయాల్లో విస్తృతంగా సేవ చేయాలని నిర్ణయించుకుంటున్నట్లు తెలిపారు. ఎలాంటి లాభార్జన లేకుండా సేవ చేస్తానని తెలిపారు. ప్రజా సేవకే తన జీవితాన్ని అంకితం చేయాలని నిర్ణయించుకుంటున్నట్లు తెలిపారు. పలువురు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పోలేరమ్మ ఆలయం గొల్లపాళెంలోని అంకమ్మ గుడి వద్ద మస్తాన్ యాదవ్ పూజలు నిర్వహించారు. గొల్లపాళెంలో అభిమానులు అన్నదానం చేశారు. ట్రస్ట్ కార్యాలయం వద్ద భారీ ఎత్తున అన్నదానం చేశారు. అన్ని మతస్థుల వారు మస్తాన్ యాదవ్‌ను ఆశీర్వదించారు. ఈ టీడీపీ నాయకులు తోట రామచంద్రయ్య, శ్రీనివాసులు, మురళీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణం కోసం ప్రత్యేక ప్రణాళిక

**సూళ్లూరుపేట, జూలై 2 ప్రభాతవార్త**

సూళ్లూరుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ ఇంటర్నేషనల్ ఆదేశాల మేరకు పర్యావరణాన్ని పరిరక్షించే క్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారంచుట్టనున్నట్లు నూతన రోటరీ క్లబ్ అధ్యక్షులు అట్రంబాకం దశరథరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నానని, తనతో పాటు కార్యదర్శిగా ఎం.వినయ్‌సాగర్ పనిచేస్తారన్నారు. సూళ్లూరుపేటలో పచ్చదనం కోసం దాతల సహకారం తీసుకొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. సమాజ సేవలో సూళ్లూరుపేట ప్రాంతంలో రోటరీ క్లబ్ ఇప్పటివరకు విస్తృత సేవా కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అదే స్ఫూర్తితో తాను కూడా సభ్యుల సహకారంతో రోటరీ క్లబ్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. ఉచిత నేత్ర వైద్యశిబిరాలు, ఆయుర్వేద వైద్యశిబిరం, రక్తదాన శిబిరాలను నిర్వహిస్తామన్నారు. పాఠశాలలను ఎంపిక చేసి వారికి ఫర్నిచర్ సమకూర్చే ప్రక్రియను కొనసాగించనున్నట్లు దశరథరెడ్డి తెలిపారు. అలాగే పేదలకు ఉపయోగపడే కార్యక్రమాలను కూడా చేపడతామన్నారు. సోమవారం నాడు రోటరీ సమావేశ మందిరంలో దొడ్ల భరత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రొటేరియన్ కె.మునిగిరీష్, బి.శ్యామసుందరరావు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో వి.శివకుమార్‌రెడ్డి, పి.ఆదినారాయణరెడ్డి, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్లకు సన్మానం



**సూళ్లూరుపేట, జూలై 2 ప్రభాతవార్త**

సూళ్లూరుపేటలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డేను పురస్కరించుకొని ప్రత్యేకంగా ప్రజలకు సూళ్లూరుపేట ప్రాంతంలో సేవలందిస్తున్న డాక్టర్లను సన్మానించారు. డాక్టర్ ఎ.అపరాజిత, పరుచూరు సుబ్రహ్మణ్యం, పరమేశ్వరరావు, శోభయాని, ఐ.పవన్‌సాయికుమార్‌లను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## గంగ జలాలను విడుదల చేయాలి



**కోట, జూలై 2 ప్రభాతవార్త**

కోట మండలం ఊనుగుంటపాలెంలో వరిపంట చివరి దశలో ఉందని ఆ గ్రామ రైతులు అధికారులకు తెలియజేశారు. రుతు పవనాల జాడ కనిపించకుండా జూలై ప్రారంభమైన ఎండలు మండిపోతున్నాయని తెలిపారు. బావుల్లో నీరు అడుగంటింది. చెరువులు, కాలువలు వెలవెలబోతున్నాయి. బోర్ల నుంచి నీరు తక్కువగా వస్తుంది. దీంతో చివరి దశలో ఉన్న పంటను ఎలా కాపాడుకోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. తెలుగుగంగ ఇంజనీర్లు రైతుల బాధలను అర్థం చేసుకొని తెలుగుగంగ జలాలను బ్రాంచి కాలువలకు విడుదల చేయాలని కోరారు. లేకుంటే కళ్లెదుటే ఎండిపోతున్న పంటలను చూసి ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని చెప్పారు.

## ఆక్రమణల చెరలో ఆయకట్టు చెరువులు

**కోట, జూలై 2 ప్రభాతవార్త**

చెరువులు చిక్కిపోతున్నాయి. నీటి సామర్థ్యాన్ని కోల్పోతున్నాయి. సాగునీరు అందుకుంటున్న వారే ఆక్రమణలకు పాల్పడుతున్నారు. కనీస నిర్వహణ, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఏటా ఆయకట్టు చెరువులు కుంచించుకుపోతున్నాయి. కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాలెం పెన్నక్క చెరువు ఇప్పటికే ఆక్రమణలకు గురైంది. ఇటీవల నీటిపారుదల శాఖ, రెవెన్యూ అధికారులకు ఆ గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఇక కోట చెరువు ఇప్పటికే ఇటుకబట్టీలతో నిండిపోయి ఉంది. పుచ్చలపల్లి జమ్మలమిట్ట చెరువులు 70 శాతం ఆక్రమణలతో అనధికారికంగా వందలాది ఎకరాలు సాగు చేస్తున్నారు. ఏళ్ల తరబడి నిర్వహణ లేక పలు చెరువులు రూపుమారుతున్నాయి. అధికారులకు పలుమార్లు విన్నవించిన ఆక్రమణదారుల జోలికి వెళ్లడం లేదని ఆయా గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు.

## మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు

– గూడూరు వన్‌టౌన్ సీఐ హజరత్



**గూడూరు, జూలై 2 ప్రభాతవార్త**

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గూడూరు వన్ టౌన్ సిఐ జి.హజరత్ తెలిపారు. ఆదివారం గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద ఆయన ఆటోలను, మోటార్ బైక్‌లను తనిఖీ చేశారు. వాహనదారులకు, డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. మద్యం సేవించి వాహనాలను నడపడం వల్ల ఎక్కువగా ప్రమదాలు జరుగుతున్నాయని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలపై ఆటోడ్రైవర్లకు, మోటార్‌బైక్ యజమానులకు అవగాహన కల్పించారు. సీఐ హజరత్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తరచుగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నామని, కేసులు పెట్టి జైలుకు కూడా పంఉతున్నామని తెలిపారు. మైనర్లు వాహనాలు నడపరాదని, మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

## సిరామిక్ విభాగంలో నిషిత్‌కు ఫస్ట్ ర్యాంక్



**కోట, జూలై 2 ప్రభాతవార్త**

కోట మండలం మద్దాలికండ్రిగకు చెందిన చిట్టేటి నిషిత్ సిరామిక్ టెక్నాలజీలో ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. గూడూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిషిత్ ఫైనలియర్ చదువుతున్నాడు. ఆ మేరకు ఫైనలియర్‌లో 84.1 శాతం మార్కులు సాధించి ఇంజనీరింగ్ సాధించేందుకు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ క్రమంలో ఆ విద్యార్థికి సిరామిక్ విభాగంలో ఫస్ట్ ర్యాంకు ప్రకటించారు. ఈ సందర్భంగా విద్యార్థి నిషిత్ 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ తాను ఇంజనీరింగ్ చేయాలని కష్టపడి చదివానని చెప్పాడు. తన తల్లిదండ్రులు నారాయణ, ప్రశాంతి ప్రోత్సాహంతో బాగా చదివానని, తమది వ్యవసాయ కుటుంబమని చెప్పారు.

## రోటరీ క్లబ్ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా రామకృష్ణ, స్వరూప్ శ్రవణ్‌కుమార్



**గూడూరు, జూలై 2 ప్రభాతవార్త**

రోటరీ క్లబ్ గూడూరు 2023–24 సంవత్సరానికి గాను నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా సి.రామకృష్ణ స్వరూప్, పి.శ్రవణ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గూడూరు పట్టణంలోని రోటరీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా పిడిజి కొణిదల మునిగిరీష్ మాట్లాడుతూ నూతన కమిటీలోని అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నెల 5వ తేదీన నూతన కమిటీ బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు. రొటేరియన్ దశరథరామిరెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు రోటరీ క్లబ్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అలాగే నూతనంగా ఎన్నికైన వారు కూడా రాబోయే రోటరీ సంవత్సరంలో అనేక కార్యక్రమాలు చేపట్టి ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఏజీ మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ అధ్యక్ష కార్యదర్శులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రోటరీ క్లబ్ గూడూరు నూతన అధ్యక్ష పదవికి ఎన్నికైన సి.రామకృష్ణ స్వరూప్ మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టనున్నానని, ప్రెసిడెంట్‌గా తనవంతు కృషి చేసి సామాజిక సేవా కార్యక్రమాల్లో రోటరీ క్లబ్ ఎప్పుడూ ముందుండే విధంగా తీసుకెళ్తానని తెలిపారు. కార్యదర్శి పి.శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ కార్యదర్శిగా ఎన్నిక కావడానికి సహకరించిన రొటేరియన్లకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్స్ బాలకృష్ణంరాజు, నాగసునీల్‌కుమార్, రవికుమార్, తిరుమూరు సురేష్‌రెడ్డి, ఎంసీ మల్లయ్య, డి.శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



**దొరవారిసత్రం, జూలై 2 ప్రభాతవార్త**

దొరవారిసత్రం సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు, ఏకొల్లు గ్రామానికి చెందిన సి.యల్లయ్య కాలి నడకన దొరవారిసత్రం నుంచి కుప్పారెడ్డిపాలెం వైపు వెళుతుండగా చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళుతున్న లారీ అదుపుతప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో యల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని 108లో నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## థామస్ గెలుపుకోసం కలిసికట్టు కృషి

– 'దేశం' తీర్థం పుచ్చుకొన్న మాజీ ఎంపిపి మీనా మోహన్



**పాలసముద్రం, జులై 2 ప్రభాతవార్త:**

జిడినెల్లూరు తెలుగుదేశం అభ్యర్థి డాక్టర్ థామస్ విజయం కోసం నాయకులు, కార్యకర్తలు కలసికట్టు కృషి చేయాలని తీర్మానించారు. పాలసముద్రం మండల పార్టీ కార్యాలయంలో ఆదివారం జిడినెల్లూరు నియోజకవర్గ దేశం ఇన్‌ఛార్జీ థామస్ మాజీ జడ్పీటీసీ భీమినేని చిట్టిబాబుతో కలిసి తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జీ డాక్టర్ థామస్ మాట్లాడుతూ కార్యకర్తలకు తాను ఎల్లప్పుడు అండగా నిలుస్తానని, పార్టీ విజయానికి ప్రతి ఒక్కరు శాయశక్తుల కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పాలసముద్రం మండల మాజీ ఎంపిపి మీనా మోహన్ మాజీ జడ్పీటీసీ భీమినేని చిట్టిబాబు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి మీనా మోహన్ మాట్లాడుతూ తాను గతంలో టిడిపి ఎంపిపిగా వున్నానని, వైకాపా ఆవిర్భావంతో స్నేహితుల ప్రోద్బలంతో ఆ పార్టీలో చేరానని, ఆ పార్టీలో కొన్ని సమస్యలు ఉత్పన్నం కావడంతో మళ్ళీ సొంత పార్టీలో చేరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేటి గ్రీవెన్స్‌డే రద్దు

**చిత్తూరు, జులై 2 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రతి సోమవారం కల్టెరేట్‌లో కలెక్టర్ సగిలి షన్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించే స్పందన కార్యక్రమం ఈ వారం రద్దయ్యింది. చిత్తూరులో మంగళవారం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటన వుండటంతో సిఎం పర్యటన ఏర్పాట్లలో అధికార యంత్రాంగం తలమునకలై వుండటంతో సోమవారం గ్రీవెన్స్‌డేను రద్దు చేసినట్లు కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రజలు ఎవ్వరు దూర ప్రాంతాల నుండి సమస్యలపై అర్జీలు తీసుకొని ఈ వారం కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ సూచించారు.

## నేటి పోలీస్ స్పందన రద్దు

**చిత్తూరు, జులై 2 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి సోమవారం పాత జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమం ఈ వారం రద్దు చేశారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లలో పోలీసు అధికారులు నిమగ్నం అయి వుండటంతో సోమవారం గ్రీవెన్స్‌డేను నిర్వహించడం లేదని ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు

## అట్లాంటాలో వైభవంగా శ్రీనివాసకల్యాణం

తిరుమల, జులై 2ప్రభాతవార్తప్రతినిధి:



కలియుగప్రత్యక్షదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి వైభవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పేలా జరిపించే శ్రీనివాస కల్యాణంఅమెరికా అట్లాంటాలో ఆదివారం వేడుకగా జరిగింది. శ్రీనివాసకల్యాణం ప్రాజెక్టు ఆధ్వర్యంలో అట్లాంటాలో జరిగిన వెంకన్న కల్యాణోత్సవంలో టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి దంపతులు పాల్గొన్నారు. అర్చకులుశాస్త్రోక్తంగా ఈ కల్యాణంజరిపించారు. భక్తులకు స్వామివారి లడ్డూప్రసాదాలు అందజేశారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## మహాపూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు



తిరుపతి, జులై 2ప్రభాతవార్త:
తిరుపతిలోని ప్రసిద్ధ శైవాలయం కపిలతీర్థంలోని కపిలేశ్వరస్వామి ఆలయంలో మూడురోజుల పాటు నిర్వహించిన పవిత్రోత్సవాలు ఆదివారం మధ్యాహ్నం మహాపూర్ణాహుతితో ముగిశాయి. ఉదయం యాగశాలలో యాగశాలపూజ, హోమం, మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, మూలవర్లకు కలశాభిషేకం, పట్టుపవిత్ర సమర్పణ చేపట్టారు. సాయంత్రం పంచమూర్తులు సోమస్కంధమూర్తి, కామాక్షిఅమ్మవారు, విఘ్నేశ్వరస్వామి, వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, చండికేశ్వర స్వామివార్లకు వీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ డిప్యూటీ ఇఒ దేవేంద్రబాబు, ఎఇఒ సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ పాల్గొన్నారు.

## సిఎం జగన్ పర్యటనతో
# పాడి రైతుకు మరింత మేలు

**- రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి**



సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిప్యూటీ సిఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు.

చిత్తూరు, జులై 2 ప్రభాతవార్త:
చిత్తూరు జిల్లాలో పాడి రైతుకు మరింత మేలు జరిగేలా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన వుండనుందని రాష్ట్ర భూగర్భ గనులు, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రం చిత్తూరులో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మంగళవారం పర్యటించనున్న నేపథ్యంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి డిప్యూటీ సిఎం నారాయణస్వామి, కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో కలిసి జిల్లా పోలీసు పెరేడ్ మైదానంను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు దేశానికే తలమానికంగా నిలిచిన చిత్తూరు విజయ పాల డెయిరీ మూతపడటంతో జిల్లాలోని పాడి రైతులకు మరింత మేలు చేయాలని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిర్ణయించి ఆమూల్ డెయిరీతో కలిసి చిత్తూరు విజయ పాల డెయిరీని పునఃప్రారంభించడానికి మంగళవారం వస్తున్నారన్నారు. ఆమూల్ డెయిరీతో పాడి రైతులకు పాల ధర పెరగనుందన్నారు. దీని ద్వారా పాడి రైతుకు మేలు జరుగుతుందన్నారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల్లో మూత పడిన చిత్తూరు విజయ డెయిరీని పునఃప్రారంభిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్తూరు విజయ పాల కార్మాకారంను పునఃప్రారంభించడానికి చర్యలు చేపట్టారన్నారు. డిప్యూటీ సిఎం నారాయణస్వామి మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మంగళవారం పాల్గొననున్న బహిరంగ సభకు ఏర్పాట్లు ముమ్మరంగా చేపడుతున్నారు. చిత్తూరు జిల్లా పోలీసు పెరేడ్ గ్రౌండ్స్ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయడానికి జిల్లా అధికార యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. అలాగే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్తూరు విజయ డెయిరీను ఆమూల్ డెయిరీ యాజమాన్యంతో కలిసి పునఃప్రారంభించడానికి మంగళవారం భూమిపూజ చేయనున్నారన్నారు. అలాగే చీలాపల్లి సిఎంసి ఆసుపత్రిలో 300 పడకల ఆసుపత్రి నిర్మాణానికి సిఎం భూమి పూజ చేయనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ ఎస్.రాజశేఖర్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ బుల్లెట్ సురేష్, అడిషనల్ ఎస్పీలు సుధాకర్, శ్రీలక్ష్మిలు, జడ్పీ సిఇఒ ప్రభాకర్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఇ కృష్ణారెడ్డి, చిత్తూరు ఆర్డీఓ డాక్టర్ రేణుక, చుడా ఛైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

**-పోటెత్తిన భక్తజనం**



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు, ప్రవేశానికి క్యూలైన్లలో హాజరైన అశేష భక్తజనం

శ్రీకాళహస్తి, జూలై 2 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయం సారధ్యంలో నిర్వహించే ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమాల్లో ప్రజలు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. కన్నుల పండవగా అగ్నిగుండ ప్రవేశాన్ని జరిపారు. భక్తులు గోవింద నామ స్మరణతో, పసుపు పచ్చదనంతో కైలాసం పులకించింది. గెరిగె రాకముందే అమ్మవారిని అగ్నిగుండం వద్దకు తెచ్చి ప్రతిష్టించారు. పూజలు జరిపిన తరువాత గుండం చుట్టూ గుమ్మడికాయలు, పెరుగు, పెరుగన్నం, కర్పూరం వెలిగించారు. అగ్నిగుండంలో మొదట పూల బంతిని వేసిపూజారి ప్రవేశంచేశారు. అనంతరం భక్తులు భక్తిశ్రద్ధలతో అగ్నిగుండంలో ప్రవేశించారు. సుమారు నాలుగువేల ఐదు వందల మంది భక్తులు కంకణం కట్టుకోకుండా ప్రవేశించారు.

**ఎటు చూసినా అలంకారాలేః**

శ్రీకాళహస్తి పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి ఎటు చూసినా పసుపుపచ్చబట్టలు, తలకు పూలపాగా, చేతిలో వేపమండ, చక్కగా గంధం అలంకారంతో అగ్నిగుండ ప్రవేశం చేసే భక్తులు కనిపించారు. సాధారణంగా అగ్నిగుండ ప్రవేశం చేసే భక్తులుదేవస్థానికి రూ. 25 చెల్లించి కంకణంధరించి ప్రవేశించే వారు. ఈ ఏడాది ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు చొరవతో ప్రవేశ రుసుంను రద్దు చేసారు. ఏ ఏడాదికా ఏడాది అగ్నిగుండం ప్రవేశం చేసే భక్తుల సంఖ్య గణనీయంగాపెరిగింది. ధర్మరాజుల స్వామి ఆలయాభివృద్ధికి ఎప్పడికప్పుడు పాలకులు, అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో అగ్నిగుండం ప్రక్కన బురదమయంగా మారేది. ఈ సమస్యను పరిష్కరించుటకు చుట్టూ ఫ్లోరింగ్‌చేశారు.

**.శాస్త్రోక్తంగా ఏడు స్నానాలుః-**

అగ్నిగుండ ప్రవేశానికి ముందుగెరిగె వస్తుంది. పోతురాజు పట్టణంలో ఊరేగిన తరువాత ఉదయం నుంచి ఏడుచోట్ల స్నానమాచరించడం ఆనవాయితీ. ఉదయం ఆలయపూజారులు, వేదపండితులు, పాలకులు రాగా ఈశాన్య మూల ఏర్పాటు చేసిన హోమం నుంచి నిప్పు కణితలను తీసుకొచ్చి అగ్నిగుండాన్ని రగిలించారు. సాయంత్రం వరకు వరకు నిప్పులను రగిలించారు. అక్కడ అగ్నిగుండం రగులుతుంటే గెరిగె, పోతురాజులు ఏడు సార్లు స్నానాలు ఆచరించారు. తరువాత రాహుకాలం దాటిన తరువాత ఆరు గంటలకు పట్టణంలో ప్రదక్షిణలు చేసుకొని రాగా అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. అగ్నిగుండంలో మొదట పూజారి దిగగా, తరువాత గెరిగె, పోతురాజుల విగ్రహాలను దింపారు. రాహుకాలం దాటిన తరువాత ద్రౌపదీ అమ్మవారిని చక్కగా ముస్తాబుచేసి అగ్నిగుండం ఎదురుగా తూర్పు అభిముఖంగా ప్రతిష్టించారు. అగ్నిగుండానికి పూజారి దయానందం, పురుషోత్తం శాస్త్రోక్తంగా పూజలు జరిపి బలిఇచ్చిన తరువాత నిప్పు కణికలనుతెచ్చి అమ్మవారిఒడిలో పూలలో కట్టారు. తరువాత గోవింద నామస్మరణతో అగ్నిగుండ ప్రవేశం జరిపారు.

## సింహవాహనంపై అమ్మవారి దర్శనం



శ్రీకాళహస్తి, జూలై 2 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయంగా వెలసి ఉన్న ద్రౌపదీదేవి సమేత ధర్మరాజులస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం చివరిరోజైన అగ్నిగుండ మహోత్సవం అనంతరం రాత్రి ద్రౌపదీదేవి అమ్మవారు భీముడితో కలసి సింహవాహనంపై పురవీధుల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈసందర్భంగా ఉత్సవం ఆలయం నుంచి జయరామారావువీధి, బజారువీధి, తేరువీధి, నెహ్రూవీధిలో గ్రామోత్సవం నిర్వహించి తిరిగి ఆలయానికి చేరుకున్నారు. ఉదయం ఆలయ ఆవరణలో దుర్యోధన, దుశ్శాసన వధ తరువాత ద్రౌపదీ అమ్మవారి సిగ ముడి వేసిన తరువాత పట్టణంలో భీమసమేత ద్రౌపదమ్మ పట్టణంలో కన్నుల పండువగా ఊరేగించారు. పోతురాజు ముందువెళుతుండగా గ్రామోత్సవం ఎంతో ఘనంగా నిర్వహించారు. ఊరేగింపుతో పాటు ఉభయదారులు పి.సుధీర్ బాబు తరఫున బంధువులు హాజరయ్యారు. ఊరేగింపుతో పాటు ఉత్సవాల ఇన్‌చార్జి వెంకటస్వామి, దుర్గా ప్రసాద్, దఫేదార్ దామోదరం సిబ్బంది తదితరులు పాతవరదయ్యపాళెం రోడ్డు, జయరామారావు వీధి, జబారువీధి, తేరువీధి, నెహ్రూవీధి, నగరి వీధుల మీదుగా ఉత్సవం సాగింది.

## షార్‌లో మళ్లీ రాకెట్ ప్రయోగాల సందడి

**- పదిరోజుల వ్యవధిలో రెండు ప్రయోగాలు**



చంద్రయాన్-3 బృందాన్ని ఇటీవల అభినందిస్తున్న ఇస్రో ఛైర్మన్, షార్ డైరెక్టర్ తదితరులు

శ్రీహరికోట (తడ), జూలై 2 ప్రభాతవార్త
శ్రీహరికోటలో మళ్లీ రాకెట్ ప్రయోగాల సందడి నెలకొంది. ఈ నెలలోనే రెండు రాకెట్లను ప్రయోగిస్తున్నారు. ఈ నెల 13న చంద్రయాన్-3ని ఎల్‌విఎం3 రాకెట్ ద్వారా ప్రయోగిస్తుండగా, 23న పిఎస్‌ఎల్‌వి సి-56 రాకెట్‌ను షార్ నుంచి ప్రయోగిస్తున్నారు. ఈ రాకెట్ ద్వారా సింగపూర్ తదితర దేశాలకు చెందిన కమర్షియల్ ఉపగ్రహాల ప్రయోగం ఉంటుంది. షార్‌లో రెండు కీలక ప్రయోగాల నేపథ్యంలో శాస్త్రవేత్తలు బిజీ అయ్యారు. ముఖ్యంగా చంద్రయాన్-3 ప్రయోగం సరికొత్త పరిశోధనలకు అడ్డాగా మారనుంది. చంద్రునిపై విభిన్న పరిశోధనల నేపథ్యంలో ఇప్పటికి ప్రయోగించిన చంద్రయాన్-1, చంద్రయాన్-2ల ద్వారా ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ఈసారి చంద్రయాన్-3ని ప్రతిష్టాత్మక ప్రయోగంగా భావిస్తున్నారు. ఈ ప్రయోగం విజయవంతమైతే భవిష్యత్‌లో చంద్రునిపై కాలుమోపే వ్యోమగాములను సైతం మన రాకెట్ల ద్వారా ప్రయోగించుకునే సామర్థ్యాన్ని మెరుగుపరుచుకుంటామని ఇస్రో ధీమాగా ఉంది. చంద్రయాన్-3కి సంబంధించి వివిధ పరిశోధనలు, పరీక్షలలో పాల్గొన్న దేశంలోని శాస్త్రవేత్తల బృందాన్ని ఇప్పటికే ఇస్రో ఛైర్మన్‌తో పాటు మాజీ ఛైర్మన్లు, వివిధ ఇస్రో కేంద్రాల డైరెక్టర్లు అభినందించి ఉన్నారు. ఈ ప్రయోగం తర్వాత సరిగ్గా పదిరోజుల్లో శ్రీహరికోట నుంచి జరగనున్న పిఎస్‌ఎల్‌వి సి-56 ప్రయోగం ద్వారా ఇస్రో మళ్లీ వాణిజ్య ఆదాయానికి తెరలేపనుంది. ఇప్పటికే వివిధ దేశాల అంతరిక్ష పరిశోధన సంస్థలు ఉపగ్రహాలను రూపొందించుకొని మన రాకెట్ల ద్వారా ప్రయోగించడానికి ఎదురు చూస్తున్నాయి. ఇటీవల చంద్రయాన్-3, ఆదిత్య ఎల్-1, గగన్‌యాన్ వంటి ప్రయోగాలపై దృష్టి పెట్టిన ఇస్రో వాణిజ్య ప్రయోగాలను కొంత తగ్గించింది. తిరిగి పిఎస్‌ఎల్‌వి-సి56 రాకెట్ ద్వారా ఆ కొరతను తీర్చుకోవడానికి ప్రయత్నిస్తోంది.

## వైసీపీ నాయకుడు అనుమానాస్పద మృతి

వడమాలపేట, జూలై 2 ప్రభాతవార్త:



అనుమానాస్పద స్థితిలో భక్తవత్సలం మృతదేహం

తిరుపతి జిల్లా వడమాలపేట మండలం చెన్నై హైవే రోడ్డు పక్కన వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు ఆదివారం కనుగొన్నారు. శవం పక్కన లభించిన గుర్తింపు కార్డు ఆధారంగా చిత్తూరుజిల్లా తవనంపల్లి మండలానికిచెందిన వైసీపీ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి భక్తవత్సలం(41)గా పోలీసులు గుర్తించారు. పోలీసుల, బంధువుల కథనం మేరకు.... శ్రీకాళహస్తి రూరల్ మండలం చాలపాళెం గ్రామానికి చెందిన భక్తవత్సలం తవణంపల్లి మండలం బెంగలంపల్లి గ్రామానికి చెందిన లలితను వివాహం చేసుకుని అత్తగారి ఇంటిలోనే కాపురం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు భక్తవత్సలం తల్లిదండ్రులు రేణిగుంట మండలం ఎలమండ్యం గ్రామానికి వచ్చి స్థిరపడ్డారు. అధికార పార్టీ కార్యక్రమాల్లో చురుకుగాపాల్గొనే భక్తవత్సలం శనివారం పెద్ద కుమార్తెను కౌన్సిలింగ్ నిమిత్తం తిరుపతికి తీసుకుని వచ్చాడు. సాయంత్రం ఎలమండ్యం వచ్చి కుమార్తెని తల్లిదండ్రుల వద్ద వదలి పని ఉంది వెళ్లివస్తానని బయటకు వెళ్లాడు. వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. ఆదివారం ఉదయం అతని మృతదేహాన్ని కదిరిమంగళం వద్ద జాతీయ రహదారి పక్కన లభించింది. మృతదేహం పై పలు చోట్ల కమిలిపోయి ఉంది. ఎవరైనా హత్య చేసి తెచ్చి ఇక్కడ పడేసి ఉండవచ్చునని అనుమానం వ్యక్తంచేస్తున్నారు. పుత్తూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్, వడమాలపేట ఎస్ఐ రామాంజనేయులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ముఖ్యమంత్రి పర్యటన భద్రతపై
# ముందస్తు భద్రత సమావేశం



రేణిగుంట, జూలై 2 ప్రభాతవార్త:
రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 4వ తేదీ చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా రెవెన్యూ పోలీసు అధికారులు రేణిగుంట విమానాశ్రయంలో భద్రతపై ఆదివారం సమావేశం నిర్వహించారు. మంగళవారం ఉదయంరేణిగుంట విమానాశ్రయానికి 9.15 గంటలకు చేరుకుని అక్కడి నుంచి 9.25 లకు హెలికాప్టర్‌లోచిత్తూరు జిల్లాకు వెళ్లి అక్కడ వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మధ్యాహ్నం 2.5 గంటలకురేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. సెక్యూరిటీ లిజనింగ్‌లో భాగంగా సంబంధిత అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి, జేసీ బాలాజీ, ఎస్పీ పరమేశ్వరరెడ్డితో కలసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ బందోబస్తు పటిష్టంగా ఉండాలని పోలీసులకు సూచనలు చేశారు. సమావేశంలో శ్రీకాళహస్తి ఆర్డీవో రామారావు, ఎయిర్‌పోర్టు సీఎస్‌వో రాజశేఖర్‌రెడ్డి, డిప్యూటీ కమాండెంట్ కున్వర్ బహుదూర్, ఏఎస్పీలు కులశేఖర్, విమల కుమారి, జిల్లా ఫైర్ అధికారి రమణయ్య, డీఎస్పీలు భవ్యకిషోర్, యశ్వంత్, రవీంద్రరెడ్డి, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవి ప్రభు, స్విమ్స్ ఆస్పత్రి సీఎంవో శివశంకర్, జిల్లా రోడ్ల భవనాల అధికారి సుధాకర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రెడ్డెప్పరెడ్డి, రేణిగుంట తహసీల్దార్ ఉదయ, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## కార్వేటినగరంలో వైభవంగా అగ్నిగుండ ప్రవేశం



అగ్నిగుండప్రవేశం చేస్తున్న భక్తులు, బలిజ కులస్థులు సారె

కార్వేటినగరం, జూలై 2 ప్రభాతవార్త:
కార్వేటినగరం శ్రీద్రౌపదీదేవి సమేత ధర్మరాజులస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వైభవంగా అగ్నిగుండప్రవేశం నిర్వహించారు. అగ్నిగుండ ప్రవేశానికి కంకణరుసుము 400రూ,,లుగా ఖరారు చేశారు. ఆదివారం 700 పైగా భక్తులు కంకణాలు ధరించారు. పోతురాజు వెంబడి భక్తులు నీటిబావుల్లో స్నానమాచరించి స్కందపుష్కరిణి వద్దకు చేరుకున్నారు. భక్తులు పసుపు వస్త్రాలు, పూలమాలలు ధరించి ఆలయం చేరుకున్నారు. ద్రౌపదీదేవి స్కందపుష్కరిణి నుండి ఆలయం వద్దకు చేరుకోగా అర్చకులు నిప్పులను అమ్మవారి ఒడిలో పోయడం, పూలచెండును నిప్పుల్లో వేయడం, గుండానికి గుమ్మడికాయతో దిష్టి తీయించి గెరిగెను గుండంలో ప్రవేశింప చేస్తారు. అనంతరం వరుస క్రమంలో భక్తులు గోవిందనామాలు పలుకుతూ అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఆదివారం ఉభయదారులైన బలిజకులస్తులు, తోట విజయులునాయుడు కుమారులు అమ్మవారికి సారె తీసుకెళ్ళారు. కార్వేటినగరం, ఎస్ఆర్‌పురం, వెదురుకుప్పం పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. పలువురు భక్తులు ఆలయ అభివృద్ధికి విరాళాలు సమర్పించుకున్నారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని ఆలయ ప్రాంగణంలో పొంగళ్ళు పెట్టారు. కార్యక్రమంలో ఎంపిపి లతాబాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ, ఆలయ అధ్యక్షులు పోకల సోమనాథ్, ప్రధానకార్యదర్శి హరిబాబు, ఉపాధ్యక్షులు శివప్రకాష్, కోశాధికారి బాబురెడ్డి, ఉపకోశాధికారి కృష్ణయ్య, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## గోవిందరాజ ఉత్సవర్లకు
## బంగారుకవచధారణ



తిరుపతి, జులై 2ప్రభాతవార్త:
తిరుపతిలో ఉన్న గోవిందరాజస్వామి ఆలయంలో మూడురోజుల పాటు శాస్త్రోక్తంగా నిర్వహించిన జ్యేష్టాభిషేకం ఆదివారం సాయంత్రం తిరిగి బంగారుకవచం ధారణతో ముగిశాయి. ఉదయం శ్రీదేవిభూదేవిసమేత గోవిందరాజస్వామి ఉత్సవమూర్తులకు కల్యాణమండపంలో పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరిజలంతో విశేషస్నపనతిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు తిరిగి బంగారు కవచాలు ధరింప జేశారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, ప్రధాన అర్చకుడు శ్రీనివాసదీక్షితులు, వైఖానస ఆగమసలహాదారుడు మోహనరంగాచార్యులు, ఎఇఒ రవికుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్లు మోహన్‌రావు, నారాయణ, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రాధాకృష్ణ, ధనంజయులు అర్చకులు, పాల్గొన్నారు.

## తొలగించిన విగ్రహాలను తిరిగి ఏర్పాటు చేయండి

**కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్**

తిరుపతి కార్పొరేషన్, జూలై 2, ప్రభాతవార్త



తిరుపతి శ్రీనివాస సేతు నిర్మాణ పనుల్లో భాగంగా శ్రీనివాస సేతు ఏర్పాటు కోసం తొలగించిన ప్రతి ఒక్క ప్రతిష్టాత్మక, మహనీయుల విగ్రహాలను తిరిగి పూర్తి అయిన శ్రీనివాస సేతు క్రింద ఏర్పాటు చేయాలని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి మున్సిపల్ అధికారులకు సూచనలు జారీ చేసారు. శ్రీనివాస సేతు తుది దశ పనుల్లో భాగంగా ఆర్టీసీ బస్టాండ్ ముందరున్న ప్రాంతాన్ని ఆదివారం కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి పరిశీలించి అధికారులకు తగు సూచనలు జారీ చేసారు. గతంలో ఈ ప్రాంతంలో ఎమ్మెస్ సుబ్బలక్ష్మి, తెలుగు తల్లి విగ్రహాలు అదే విధంగా పూర్ణకుంభం ఉండేవని, శ్రీనివాస సేతు పనుల్లో భాగంగా వాటిని భద్రంగా తొలగించి భద్రపరచడం జరిగిందని, శ్రీనివాస సేతు పనుల్లో భాగంగా వాటిని భద్రంగా తొలగించి భద్రపరచడం జరిగిందని, శ్రీనివాససేతు పనులు పూర్తి అయిన వెంటనే ఆయా విగ్రహాలను ఏఏ స్థలాలలో ఉంచాలో పరిశీలించి తగు జాగ్రత్తలతో వాటిని ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా యాత్రికులు ఎక్కువగా తిరిగే ఈ ప్రాంత పరిసరాల శుభ్రంగా వుండడంతో బాటు ఆకర్షణీయంగా వుండేలా రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి మున్సిపల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, కార్పొరేటర్ లడ్డు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలు



పెద్దపంజాణి, జూలై 2 ప్రభాతవార్త

రాష్ట్ర మాజీ మంత్రి నూతన కాల్వ అమర్‌నాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం పెద్దపంజాణిలో తెదేపా నేతలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనంద్, చలపతి, నేతలు మురహరిరెడ్డి, నందగోపాల్, నాగరాజురెడ్డి, వేణుగోపాల్‌నాయుడు, ఎంపిటిసి కెళవాతి సుబ్రమణ్యం, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాణిపాకంకు పోటెత్తిన భక్తజనం

### -దర్శనానికి నాలుగు గంటల సమయం
### -కిక్కిరిసిన వాహన పార్కింగ్‌లు

కాణిపాకం, జూలై 2 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి అలయం ఆదివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు ఆదివారం ప్రభుత్వ సెలవు రోజు కావడంతో ఆలయ దర్శనార్థం పెద్దఎత్తున తరలివచ్చారు. అలాగే పొరుగు రాష్ట్రం తమిళనాడులోని తిరువణ్ణామలైలో జరిగే పవిత్రమైన గురుపౌర్ణమి వేడుకలుకు వెళ్ళే భక్తులు బస్సుల్లో భారీగా తరలిరా వడం, తిరుమల వెళ్ళే తీర్థజనం కూడా కాణిపాకం స్వామివారి దర్శనార్థం రావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి



నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు



తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు మూడు నాలుగు గంటల వరకు వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. మరో వైపు తిరువణ్ణామలై వెళ్ళే భక్తులు వచ్చిన బస్సులు భారీ వాహనాలతో వాహన పార్కింగ్‌లు కిటకిటలాడాయి.

## కొండూరులో వివాహిత ఆత్మహత్య



తడ, జూలై 2 ప్రభాతవార్త

తడ మండలం కొండూరులో ఒక మహిళ ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. మీంజూరు పోలయ్య, మణెమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. అందరికీ వివాహం చేశారు. అయితే ఇటీవల కొంత అప్పుల బాధ, మరికొన్ని కుటుంబ సమస్యలు తోడవడంతో శనివారం మీంజూరు మణెమ్మ (52) ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో ఉన్న సూపర్ వాస్మాల్ హెయిర్ డై మందును తాగి అపస్మారక స్థితిలో ఉండగా కుమారులు, గ్రామస్థులు చూసి మొదట సూళ్లూరుపేటకు, అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. అయితే ఆదివారం తెల్లవారుజామున 2.15 గంటలకు ఆ మహిళ మృతిచెందినట్లు తడ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎస్పై తీరుకు నిరసనగా దళిత నేతలచే కాగడాల ప్రదర్శన



కుప్పం, జూలై 2 ప్రభాతవార్త

రామకుప్పం ఎస్పై తీరుకు నిరసనగా ఆదివారం రాత్రి స్థానిక డా॥ అంబేద్కర్ విగ్రహం ఎదుట దళిత నేతలు కాగడాల ప్రదర్శన చేపట్టి నిరసన తెలిపారు. ఈనెల 4వతేది చిత్తూరులో ముఖ్యమంత్రికి ఎస్పైపై ఫిర్యాదు చేస్తామన్నారు. దళిత కులానికి చెందిన మాజీ సర్పంచ్ మహాదేవి జయశంకర్‌ను ఎన్‌కౌంటర్ చేస్తానని ఎస్పై బెదిరించారని ఎస్పైపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత, గిరిజన, బహుజన నేతలు గణపతి, దేవరాజు, రవినాయక్, కందస్వామి, జయశంకర్, బాలచంద్రబాబు, పాపన్న, బాలు, రవీంద్ర, గోవిందప్ప, త్రివిక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## సుబ్రమణ్య స్వామికి అభిషేకం



వాకాడు, జూలై 2, ప్రభాతవార్త

వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం గ్రామంలోని ఆదివారం శ్రీ సుబ్రమణ్యస్వామి దేవాలయంలో ఆషాడ శుద్ధ చతుర్ధశి పురస్కరించుకుని స్వామి వారికి చతుర్ధశ కలశ స్థాపనలు జరిపారు. అర్చకులు దీవి అనంతా చార్యులు స్వామి వారికి విశేషంగా 14 రకాల ద్రవ్యాల తో అభిషేకమం జరిపించారు. ఉభయకర్తలుగా పెల్లేటి శ్రీనివాసులు రెడ్డి, సునీత దంపతులు వారి కుమార్తె తిష్యశ్రీ వ్యవహరించారు. అభిషేక కార్యక్రమాలలో దీవి తేజోవతి, తూపిలి గురుప్రసాద్, బాలాజీ శెట్టి, పోలమ్మ, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆషాడంతో కొండపై పెరిగిన భక్తుల రద్దీ



బోయకొండ(చౌడేపల్లి), జూలై 2 ప్రభాతవార్త

ఆషాడ మాసం కావడంతో శక్తిక్షేత్రం బోయకొండపై భక్తుల రద్దీ పెరిగింది. ఆదివారం రాష్ట్రంతోపాటు కర్ణాటక, తమిళ నాడుల నుంచి అధిక సంఖ్యలో యాత్రీకులు తరలి వచ్చారు. దీంతో బోయకొండ భక్తజన సంద్ర మైంది. కొండ దినాన్ని పురష్కరించుకొని వేద పండితులు, అర్చకులచే అమ్మవారికి ఉద యాన్నే విశేషాభిషేకం, అలంకరణ గావించారు. సాయంత్రం వరకు క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. ఇఒ చంద్రమౌళి, ఆలయ అధికార, సిబ్బంది యాత్రీకులకు వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసారు.

## కన్నుల పండువగా ద్రౌపదీ కల్యాణం

సదుం, జూలై 2ప్రభాతవార్త

మండల పరిదిలోని భట్టువారిపల్లె వద్ద జరుగుతున్నమహాభారతంలో ఆదివారం ద్రౌపది కల్యానోత్సవం నిర్వహించారు. తొలుత హరికథ జరిగిన అనంతరం కల్యాణం జరిపించారు. అర్చకులు కంకణదారులైన పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి దంపతుల చేతుల మీదుగా కల్యానం నిర్వహించారు. ఎంపీపీ ఎల్లప్ప, మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, వైద్యశాల చైర్మేన్ కృష్ణారెడ్డి, నడిగడ్డ నాగబూషణరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మొరవపల్లె పంచాయతీ బురకాలయబండపై వెలసిన శ్రీశ్రీశ్రీ గంగాబ్రాహ్మణీ ఇరూపాక్షమ్మ దేవస్థానంలో గంగజాతర మొదలు పెట్టారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలునిర్వహించారు. అనంతరంభక్తులకు తీర్థప్రసాదాలు వినియోగించారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

## వైభవంగా దుర్యోధన వధ

పాలసముద్రం, జులై 2 ప్రభాతవార్త:



కృష్ణజిమ్మాపురం కొండం గ్రామంలో ధర్మరాజుల ఆల యంలో జరుగుతున్న మహా భారత ఉత్సవాల్లో ఆదివారం దుర్యోధన వధ వైభవంగా జరిగింది. మహాభారత దేవాలయ ఆవరణలో దుర్యో ధనుడి ప్రతిమను ఏర్పాటు చేసి అక్కడ భీముడు, దుర్యో ధనుడు యుద్ధ ఘటాన్ని శ్రీ వెంకటేశ్వర నాట్య కళామండి సభ్యులు ఆద్భు తంగా ప్రదర్శించారు. ఈ దుర్యోధన వధను తిలకించడానికి పరిసర గ్రామాల నుండి భారీగా ప్రజలు తరలివచ్చారు. ఈ దుర్యోధన వధ అనంతరం సాయంత్రం దేవాలయంలో ద్రౌపది అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అగ్నిగుండ కార్యక్రమం నిర్వహించారు, అగ్నిగుండం వద్దకు ద్రౌపది అమ్మవారిని అలంకరించి తీసుకువచ్చారు. కంకణం ధరించిన భక్తులు నిప్పుడు తొక్కి మొక్కులు తీర్చుకొన్నారు.

## బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శికి శివయ్య ప్రసాదాలు



శ్రీకాళహస్తి, జూలై 2 ప్రభాతవార్త

డిల్లీ నుంచి విచ్చేసిన బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి వారణాసి రామ్ మాధవ్‌ని ఆదివారం బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి కోలా. ఆనంద్‌కుమార్ ఆయన్ను కలసి శ్రీకాళహస్తీశ్వరస్వామిఅమ్మవార్ల తీర్థప్రసాదాలు అందించి శేషవస్త్రాలతో సత్కరించారు. ఈసందర్భంగా రామ్ మాధవ్ జాతీయ రాజకీయ నాయకులుగా, రచయితగా, పాత్రికేయులుగా మరియు అనేక రాష్ట్రాల్లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రచారకార్యర్తగా పనిచేసి ప్రస్తుత కాలంలో పార్టీలో కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం 370 ఆర్టికల్‌ను రద్దు యొక్క ఆవశ్యతకను దక్షిణాది రాష్ట్రాల్లో సభలు ఏర్పాటుచేసినట్లు వివరించారు.

## సిఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షించిన ఎమ్మెల్సీ తలశీల రఘురామ్

చిత్తూరు, జులై 2 ప్రభాతవార్త:

చిత్తూరులో మంగళవారం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటించే ప్రాంతాలను ఆదివారం సిఎం పర్యటనల సలహాదారు, ఎమ్మెల్సీ తలశీల రఘురామ్ ఎంపీ రెడ్డప్ప, కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మెసానికల్ గ్రౌండ్స్ స్పోర్ట్స్ కార్యాలయంలో సిఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లపై ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం కాన్వాయ్‌లో వైద్య ఆరోగ్యశాఖ స్పెషలిస్టు డాక్టర్లు, అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఫైర్ అధికారులు ఫైర్ సేఫ్టీకి సంబంధించిన ఏర్పాట్లను హెలిప్యాడ్, సిఎం కాన్వాయ్‌లో ఫైర్ వాహనాలకు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పోలీసు బందోబస్తు పటిష్టంగా వుండాలని ఎస్పీ రిశాంత్‌రెడ్డికి సూచించారు. అలాగే మంగళవారం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటించే ప్రాంతాలను ఆయన పరిశీలించారు. మెసానికల్ గ్రౌండ్స్‌లో హెలిపాడ్‌ను పరిశీలించి అనంతరం రోడ్డు మార్గంలో ఫారెస్ట్ ద్వారా గంగినేని చెరువు, చౌడేశ్వరీ సర్కిల్ ద్వారా విజయ డెయిరీకి చేరుకొని ఆమూల్ డెయిరీని ప్రారంభించే డెయిరీని ఆయన పరిశీలించారు. అనంతరం పోలీసు పెరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే బహిరంగ సభ దగ్గర ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించారు. అనంతరం గుడిపాల మండలం చీలాపల్లి సిఎంసి ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, 300 పడకల ఆసుపత్రికి నిర్వహించే భూమి పూజ కార్యక్రమం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, అడిషనల్ ఎస్పీలు సుధాకర్, శ్రీలక్ష్మీలు, డిఆర్ఓ రాజశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, ఆర్డీఓ డాక్టర్ రేణుక, డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శాకాంబరి అలంకారానికి కూరగాయలు విరాళం





కాణిపాకం, జూలై 2 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంభిగా సమేత మణికంఠేశ్వరాలయంలో సోమవారం ఆషాడ పౌర్ణమి సందర్భంగా మరగదాంభిగా అమ్మవారికి, దుర్గాదేవి అమ్మవార్లకు నిర్వహించే శాకాంబరి అలంకారంకు భక్తులు ఆదివారం ఐదు టన్నుల కూరగాయాలను విరాళంగా అందజేశారు. శ్రీమరగదాంభిగా దేవి, దుర్గాదేవిలకు వివిధ రకాల కూరగాయలు, పండ్లుతో శాకాంబరి అలంకారంను వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం పలమనేరు మార్కెట్ అసోసియేషన్ తరపున రవీంద్రరెడ్డి, బాబు, సోమశేఖర్‌నాయుడు, మోహన్‌రెడ్డిలు ఐదు టన్నుల కూరగాయలు, కరివేపాకును విరాళంగా అందజేశారు. వీటిని ఆలయ ఏఈఓ రవీంద్రబాబుకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కలి ్పంచి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఇదిలా వుండగా ఆలయంలో కూరగాయలతో అలంకరణ పనులను సిబ్బంది ప్రారంభించారు.

## జలిజలకు అండగా నిలిచే గోపీనాథ్ వెంటే నడుస్తాం

### - 60 ఏళ్ల గాజుల వారి ఆత్మీయ రాజకీయ సమ్మేళనం !!

కుప్పం, జూలై 2 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గంలో ఉన్న గాజుల, కాపు బలిజలకు అండగా, ధైర్యంగా నిలిచే మాజీ సర్పంచ్, రాష్ట్ర తెదేపా కార్యదర్శి గోపీనాథ్ వెంటే తాము నడుస్తామని గాజుల, కాపు జలిజ కులస్తులు స్పష్టం చేశారు. ఆదివారం స్థానికంగా జరిగిన ఓ కళ్యాణ మండపంలో గాజుల వారి అరవై ఏళ్ల రాజకీయ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ గాజుల కుటుంబీకులు సుమారు అరవై ఏళ్లుగా కుప్పం నియోజకవర్గంలో ప్రజాసేవలో ఉన్నారన్నారు. 1983నుంచి గాజుల కుటుంబానికి చెందిన పట్టాభి గోపీనాథ్ సామాన్య కార్యకర్తగా తెలుగుదేశం పార్టీలో తన ప్రయాణం మొదలు పెట్టి అనంతరం పార్టీలో కీలకమైన నేతగా మారారన్నారు. కుప్పం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా దాదాపు 1600ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారన్నారు. తొలినుంచే గోపీనాథ్ ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, బలిజ కులస్తులకు అండగా నిలిచి అందరివాడుగా మారారన్నారు. గోపీనాథ్ మాట్లాడుతూ బలిజ కులస్తులకు తాను అన్ని వేళలా



అందుబాటులో ఉంటూ ఆపదలో తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్నానని ముమ్ముందు కూడా అందరూ తనను ఆదరించాలని కోరారు. అనంతరం గోపీనాథ్ దంపతులను పలువురు సత్కరించారు. కార్యక్రమంలో గాజుల బలిజ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మున్నాళ్ళ ముచ్చటగా డిప్యూటీ సిఎం ప్రారంభించిన ఆర్టీసీ బస్సు

పాలసముద్రం, జులై 2 ప్రభాతవార్త:

ఏడు నెలల క్రితం డిప్యూటీ సిఎం నారాయణస్వామి అట్టహాసంగా ప్రారంభించిన ఆర్టీసీ సర్వీసు గత కొన్ని రోజులుగా రోడ్డులో కన్పించడం లేదు. కలెక్షన్లు సక్రమంగా లేదని ఆర్టీసీ అధికారులు ఈ సర్వీసును నిలుపుదల చేసినట్లు తెలిసింది. డిప్యూటీ సిఎం అట్టహాసంగా ప్రారంభించిన ఆర్టీసీ సర్వీసుకు ఆర్టీసీ అధికారులు ఎసరు పెట్టి నిలుపుదల చేస్తే ఇక ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు ప్రారంభించిన బస్సుల పరిస్థితి ఏమిటని పాలసముద్రం మండల వాసులు ఎద్దేవా చేసే పరిస్థితి ఏర్పడింది. 7 సంవత్సరాల క్రితం బెంగళూరు, కత్తెరకుప్పం, చిత్తూరు, వనదుర్గాపురం బస్సు నడిచేది. కొన్ని కారణాలతో ఆర్టీసీ అధికారులు ఈ సర్వీసును నిలుపుదల చేశారు. అయితే గ్రామస్తులు, మండల నాయకులు ఏడు నెలల క్రితం డిప్యూటీ సిఎం నారాయణస్వామి, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డిలను కలిసి విన్నవించుకోవడంతో ఈ సర్వీసు నడపడానికి ఆర్టీసీ అధికారులు అంగీకరించారు. ఈ మేరకు ఈ బస్సు సర్వీసును ఏడు నెలల క్రితం డిప్యూటీ సిఎం నారాయణస్వామి అట్టహాసంగా ప్రారంభించారు. ఆదాయం సక్రమంగా రావడం లేదని ఈ బస్సు సర్వీసును మళ్ళీ నిలుపుదల చేసినట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. గత వారం రోజులుగా ఈ రహదారిపై బస్సు కన్పించకపోవడంతో బెంగళూరుకు వెళ్ళాల్సిన ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే చిత్తూరు వరకు వెళ్ళడానికి సైతం సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు అల్లాడుతున్నారు. ఈ బస్సు సర్వీసును పునరుద్దరించడానికి చర్యలు తీసుకొని మండల ప్రజల ఇక్కట్లను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకొంటున్నారు.

## రాష్ట్ర ఇన్‌కమ్ టాక్స్ సలహా మండలి సభ్యుడిగా ఫాల్గుణకుమార్

### -చిల్లీస్ అంజిచే ఘన సన్మానం

తిరుపతి ప్రెస్‌క్లబ్, జూలై 2 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్‌కమ్ టాక్స్ సలహా మండలి సభ్యుడిగా ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ ఫాల్గుణ కుమార్ నియమితు లయ్యారు. ఆయన చేసిన సేవలు గుర్తించి భారత ప్రభుత్వం ఈ మేరకు ఆయనకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని హోటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫాల్గుణకుమార్‌కు ఘన సన్మానం జరిగింది. కార్యక్రమంలో భాగంగా చిల్లీస్ హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అధినేత చిల్లీస్ అంజి తన మిత్ర బృందంతో కలిసి ఫాల్గుణకుమార్‌ను పుష్పగుచ్ఛం, దుశ్శాలువలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియచేశారు. ఈ సందర్భంగా అంజి మాట్లాడుతూ ఫాల్గుణకుమార్ తన స్వయంకృషితో నేడు ఈ స్థాయికి వచ్చారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అంజితో పాటు హోటల్స్ అసోసియేషన్ సభ్యులు, స్నేహితులు రాజా, తదితరులు పాల్గొన్నారు.

## బర్డ్‌లో ప్రపంచ స్థాయి వైద్యప్రమాణాలు

### ఎక్కువ మంది రోగులు వినియోగించుకోవాలి
### భవిష్యత్తులో మరిన్ని జాతీయ సదస్సులు
### టిటిడి జేఈవో సదా భార్గవి
### ముగిసిన ఆపరేటివ్ ఆర్థో ప్లాస్టీ జాతీయ సదస్సు

తిరుపతి టౌన్, జూలై 2, ప్రభాతవార్త

బర్డ్ ఆసుపత్రిలో ప్రపంచ స్థాయి వైద్య ప్రమాణాలు అమలవుతున్నాయని టిటిడి జేఈఓ సదాభార్గవి చెప్పారు. ఆర్థోపెడిక్స్ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్న రోగులు ఇక్కడికి విచ్చేసి మెరుగైన చికిత్సలు పొందాలని ఆమె కోరారు. తిరుపతిలోని గ్రాండ్ రిడ్జి హోటల్‌లో బర్డ్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి ఆర్థోప్లాస్టీ సదస్సు ఆదివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన జేఈఓ మాట్లాడుతూ మోకాళ్ళ మార్పిడి, తుంటి మార్పిడికి సంబంధించి బర్డ్ ఆసుపత్రిలో అత్యుత్తమ వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఎంపిక చేసిన 22 మంది పేద రోగులకు క్లిష్టమైన సర్జరీలు చేసేందుకు దేశవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన వైద్యులను పిలిపించి లైవ్‌లో ఆపరేషన్లు చేశారన్నారు. దేశవ్యాప్తంగా దాదాపు 200 మంది యువ సర్జన్లు విచ్చేసి ఈ లైవ్ ఆపరేషన్లను చూసి సీనియర్ల వద్ద నుంచి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారని వివరించారు. మూడు రోజుల్లో 22 క్లిష్టమైన ఆపరేషన్లు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. చివరి రోజు 14 ఏళ్ల బాలికలకు మోకాళ్ళు మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించిన డాక్టర్లను అభినందించారు. ఈ సదస్సును చక్కగా నిర్వహించిన బర్డ్ ప్రత్యేకాధికారి డాక్టర్ రాచపల్లి రెడ్డెప్ప రెడ్డి, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ దీపక్ బృందాన్ని జేఈవో అభినందించారు. ఆర్థోపెడిక్స్‌లోని వివిధ విభాగాలకు సంబంధించి భవిష్యత్తులో మరిన్ని జాతీయ సదస్సులు నిర్వహించాలని కోరారు. ఇంత చక్కటి సదస్సును నిర్వహించేందుకు ఆమోదం తెలిపిన టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డికి, ఈవో ఏవి ధర్మారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసారు. బర్డ్ ప్రత్యేకాధికారి డాక్టర్ రాచపల్లి రెడ్డెప్ప రెడ్డి మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల నుండి అనేక మంది వైద్య నిపుణులు బర్డ్‌కు వచ్చి పేదలకు ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారని తెలిపారు. సదస్సులో పాల్గొన్న సర్జన్లు కూడా బర్డ్‌లో పేదలకు ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారని తెలిపారు. సదస్సులో పాల్గొన్న సర్జన్లు కూడా బర్డ్‌లో పేదలకు ఉచితంగా ఆపరేషన్లు చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇలా ఉచిత సేవ చేయడానికి ముందుకొచ్చే డాక్టర్లకు వసతి, రవాణా, భోజనం, తిరుమల స్వామి వారి దర్శనం ఉచితంగా కల్పిస్తామని చెప్పారు. హిప్ రీప్లేస్మెంట్ నిపుణులు, హైదరాబాద్ మెడికవర్ ఆసుపత్రి హెచ్ఓడి డాక్టర్ కృష్ణ కిరణ్ మాట్లాడుతూ ఈ సదస్సులో యువ వైద్యులకు సందేహాలను నివృత్తి చేయడం సంతోషకరమన్నారు. ఈ సదస్సులో పాల్గొనే అవకాశం కల్పించినందుకు బర్డ్ ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆర్థోప్లాస్టీ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ రాజ్ కుమార్ నటేషన్, ఏపీ ఆర్థోపెడిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ సునందకుమార్ రెడ్డి, మెడికల్ కౌన్సిల్ అబ్జర్వర్ డాక్టర్ సుబ్బారెడ్డి, బర్డ్ వైద్యులు డాక్టర్ ప్రదీప్, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ దీపక్, మెరిల్ సంస్థ ప్రతినిధి డాక్టర్ వివేక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ పోటీల్లో గౌస్ జట్టు విజయకేతనం

### - గూడూరు వాసి గౌస్‌కు ప్రశంసలు

గూడూరు, జూలై 2 ప్రభాతవార్త

ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ యోనెక్స్-సన్‌రైజ్ వీవీ మాటు మెమోరియల్ టోర్నమెంట్ 2023లో గూడూరుకు చెందిన షేక్ గౌస్ జట్టు విజయం సాధించింది. మహారాష్ట్రలోని పూనెలో షటిల్ బ్యాడ్మింటన్ ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ప్రత్యర్థి జట్టుపై వరుస రెండు సెట్లలో గెలిచి గౌస్ జట్టు ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ విజేతలుగా నిలిచి బంగారు పతకాన్ని సాధించారు. ఛాంపియన్స్‌గా నిలిచారు. ఆదివారం ఉదయం ప్రకాష్‌రాజ్, హేమనాగేంద్రబాబు జట్టు, షేక్ గౌస్, సిద్ధార్థ ఇళంగో జట్టుతో తలపడింది. ఉత్కంఠ భరితంగా సాగిన తొలిసెట్‌లో 12-12, 15-17, 20-20 సరిసమానంగా పాయింట్లు వస్తుండటంతో నరాలె తెగేంద ఉత్కంఠ నెలకొంది. చివరికి గౌస్ జట్టు 22-20 పాయింట్లతో ప్రత్యర్థి జట్టుపై విజయం సాధించింది. రెండవ సెట్ ప్రకాష్‌రాజ్ జట్టుపై గౌస్, సిద్ధార్థ జట్టు సునాయాసంగా గెలుపొందారు.

గూడూరు క్రీడాకారుల హర్షం

గూడూరు పట్టణానికి చెందిన షేక్ గౌస్ ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ పోటీలలో ప్రథమ స్థానం కైవసం చేసుకోవడంతో ఈ ప్రాంత క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సామాజిక మాధ్యమాలలో గౌస్, సిద్ధార్థ ఇళంగోలకు అభినందిస్తున్నారు. ది యంగ్ గూడూరు షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల కల సాకారమైందన్నారు. గౌస్ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ విజయం గూడూరు పట్టణానికే కాకుండా దేశానికి గర్వకారణమని ఆనందం వ్యక్తం చేశారు.



గెలుపొందిన క్రీడాకారులు